

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | 21 నవంబర్ 2023 | www.navatelangana.com

నువ్వు ఎంపీగా ఉండి ఎన్ని నిధులు తెచ్చావ్...

- నేనెన్ని నిధులు తెచ్చానో చూపిస్తా...చర్చకు సిద్ధమా..?
- ఇకనైనా సొల్లు మాటలు మానుకో... లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు : కందాళ



12లో...

వనమాకు పట్టం కట్టండి

- పల్లెలు మెరవాలి.. ప్రగతి ఆగొద్దు
- అభివృద్ధికి ఓటెయ్యండి
- తెలంగాణ గొంతుక కేసీఆర్ : వనమా



12లో...



అధికారం ఇస్తే క్రిస్మస్‌లోపే
దళిత బంధు అమలు చేస్తా

- మీలో ఒకడుగా ఉంటూ మీ సమస్యలు పరిష్కరిస్తా
- సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య
- పట్టణంలో వాడవాడనా అపూర్వ స్వాగతం

నవతెలంగాణ-కల్లూరు

నాలుగో సారి మీ ఓటు కారు గుర్తుపై ఓటు వేసి ఇక్కడ నేను అక్కడ కెసిఆర్ గెలిచి అధికారం చేపట్టిన వెంటనే క్రిస్టమస్‌లోపే దళిత బంధు సత్తుపల్లి నియోజకవర్గంలో అమలు చేసి రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గం అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య ఓటర్లను కోరారు. సోమవారం పట్టణంలోని అన్ని వీధుల్లో రోడ్ షో నిర్వహించగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. చెన్నూరు పెద్ద కోరుకొండి పోచారం తదితర గ్రామాల్లో నిర్వహించగా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సండ్ర కూడళ్లలో జరిగిన సభల్లో మాట్లాడుతూ గత 15 ఏండ్లుగా ఎమ్మెల్యేగా పనిచేస్తూ ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టకుండా ప్రతి ఒక్కరి సమస్యను అర్థం చేసుకొని వారికి సహాయపట్టమే నా లక్ష్యంగా

మిగతా 3లో...

దేశానికి కేరళ మోడల్
ప్రజా పరిపాలన కావాలి

భద్రాచలంకు తీవ్ర అన్యాయం చేసింది బీజేపీ, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లే

- ఆ నలుగురు తెలంగాణను పాలిస్తున్నారు
- ఐదు గ్రామపంచాయతీ తెస్తాం అనే దమ్ము బీఆర్ఎస్ కు లేదా..
- అసమర్థులు, అవకాశవాదులను ఓడించండి.. సీపీఐ(ఎం)ను గెలిపించండి
- సీపీఐ(ఎం) గెలిచే మొదటి సీటు భద్రాచలం
- విలేకరుల సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరోవిజయ రాఘవన్, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



విద్య, వైద్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా పరిపాలన అందిస్తున్న కేరళ మోడల్ దేశానికి ఆదర్శమని, దేశానికి కేరళ మోడల్ పాలన కావాలని, నేడు సమాజంలో రాజకీయ విలువలు నశిస్తున్నాయని, విలువలతో కూడిన రాజకీయాలు కావాలని, అసమర్థులు అవకాశవాదులను ఓడించి భద్రాచలం నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి కారం పుల్లయ్యను గెలిపించాలని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రాజ్యసభ మాజీ సభ్యులు, కేరళ లెఫ్ట్ గవర్నమెంట్ ఛైర్మన్ విజయ్ రాఘవన్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ లు ప్రజలను కోరారు. భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆ నలుగురు (కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావు) తెలంగాణను పాలిస్తున్నారని విమర్శించారు. భద్రాచలంకు తీవ్ర అన్యాయం చేసిన బీఆర్ఎస్‌కి ఓట్లు అడిగే అర్హత లేదని అన్నారు. ఐదు గ్రామపంచాయతీలు తెచ్చే దమ్ము బిఆర్ఎస్‌కు లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ భద్రాచలంకు ఎందుకు రావటం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ భద్రాచలం పర్యటన అహంభావపూరితంగా ఉందని, భద్రాచలం ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు

మిగతా 3లో...

జెండాలు మార్చే వారిని ఓడించండి



- జనాల కోసం పనిచేసే నాయకున్ని గెలిపించండి
- సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఈనెల 30న జరిగే పాలేరు అసెంబ్లీ ఎన్నికల్లో జెండాలు మార్చే నాయకులను ఓడించాలని సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని చింతపల్లి, శ్రీరామ్ నగర్, కొండాపురం, సీతారాంపురం, అరేంపుల, బారుగూడెం, శ్రీ సిటీ, గొల్లగూడెం, నందనవనం, రుద్ర టౌన్షిప్ గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పాలేరులో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బడా కాంట్రాక్టర్లని, డబ్బులు సంచులతో ప్రజలను ప్రలోభ పెట్టి ఓట్లు కొనేందుకు వస్తున్నారని, అలాంటి వారికి తగురీతులో బుద్ధి చెప్పి నిజాయితీపరులకే పట్టం కట్టలన్నారు. 50 ఏళ్ల నుంచి పట్టిన జెండ వీడని చరిత్ర తనదన్నారు. ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం 2003లో 2600 కిలోమీటర్ల పాదయాత్ర చేశానని, గోదావరి జలాలను పాలేరులో కలిపి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు మహాప్రస్థానం పేరుతో పాదయాత్ర చేశానని తెలిపారు. చాలా మంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారుతున్నారని, తాను ఊపిరి ఉన్నంతవరకు ఎర్రజెండా నీడలోనే ఉంటానన్నారు. 2004 ఎన్నికలు పునరావృతం కావాలని, మరోసారి తనని గెలిపించి చట్టసభలకు పంపిస్తే ప్రజా గొంతుకునవుతానని తెలిపారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్, నాయకులు పి.మోహన్ రావు, ఉరడీ సుదర్శన్‌రెడ్డి, తోట పెద్ద వెంకట రెడ్డి, నందిగామ కృష్ణ, సూదగని



యల్లయ్య, అరేంపుల ఉపేందర్, తమ్మినేని వీరభద్రయ్య, తమ్మినేని రంగారావు, దండ్యాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : కేంద్ర, రాష్ట్రాలలో ఏ ప్రభుత్వాలు ఏర్పడినా ఆ ప్రభుత్వాల మెడలు వంచి ప్రజలకు ఉపయోగపడే చట్టాలను చట్టసభల్లో అమలు చేయించి ప్రజలకు అందించిన ఘనత సీపీఐ(ఎం)దే అని సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం మండలంలోని సోలిపురం,

మిగతా 3లో...



వైభవంగా ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

- భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండాలి
- బాణా సంచాలు కాల్చుటలో జాగ్రత్తలు తీసుకోవాలి
- అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం కలెక్టర్

నవతెలంగాణ-పాల్వంచ

వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశపు హాల్లో ముక్కోటి ఏకాదశి మహెూత్సవాలు నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన

మిగతా 3లో...

c m y k

నవతెలంగాణ 02
ఖమ్మం
మంగళవారం | నవంబర్ 21 2023 | www.navatelangana.com

అండగా ఉంటా.. ఆశీర్వదించి గెలిపించండి

- సండ్రను సన్మానించిన ఆర్యవైశ్యులు

నవతెలంగాణ-కల్లూరు

గత 15 సంవత్సరాలుగా పార్టీలకు, కులాలకు, అతీతంగా ప్రజలకు సేవలు అందించి వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేశానని మరోసారి ఆశీర్వదిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య ఆర్యవైశ్యులను కోరారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పట్టణ కమిటీ అధ్యక్షులు పసుమర్తి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సండ్ర వెంకటవీరయ్య పాల్గొని మాట్లాడారు. వ్యాపారస్తులు వారి వ్యాపారాలు వారు చేసుకుంటూ ఏ చిన్న సమస్య వచ్చినా తన దగ్గరకు వస్తే వెంటనే స్పందించి పరిష్కరిష్కరించానని మీరు చేస్తున్న వ్యాపారంలో ఏనాడు నేను జోక్యం చేసుకోలేదని మీకు



అండగా ఉన్నానే తప్ప మీ అభివృద్ధికి ఏనాడు అడ్డుపడలేదని స్పష్టం చేశారు. కల్లూరుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయిని, ఆ పనులను పూర్తి చేసే అందుకే నాలుగోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తల్లాడ నుండి సత్తుపల్లి వరకు సెంటర్ లైటింగ్ డివైడర్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నానని తనను గెలిపిస్తే తొలి ప్రాధాన్యత దానికే ఇచ్చి పూర్తి చేస్తానని తెలిపారు. కల్లూరుని మున్సిపాలిటీగా చేస్తానని, అదేవిధంగా అంతర్గతంగా ఉన్న డ్రైనేజీలు తదితరు సమస్యలన్నీ పరిష్కరించేందుకు అందరూ సహకరించి మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సండ్రను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ ఉమామహేశ్వరరావు, కొండూరు సుధాకర్, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు పసుమర్తి రాంబాబు, కాటేపల్లి రజిని, గుర్రం శ్రీనివాసరావు ఆర్యవైశ్య పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మధిర



మధిర అసెంబ్లీ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు విజయాన్ని కాంక్షిస్తూ రేపు మధిర పట్టణంలో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం సభ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మధిరతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 స్థానాల్లో బిఆర్ఎస్ ఘన విజయం సాధించి మూడోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ముఖ్యమంత్రి అమలు చేసిన అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచాయని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా, రైతులకు 24 గంటలు విద్యుత్తు, దళిత బంధు, తదితర పథకాలు అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి జిల్లా ఉపాధ్యక్షులు దొండపాటి వెంకటేశ్వరరావు, మొండితోక జయకర్, బిఆర్ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిత్తారి నాగేశ్వరావు, రంగి శెట్టి కోటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, చావా వేణు, అరిగే శ్రీనివాసరావు, యన్నంశెట్టి అప్పారావు, కరివేద సుధాకర్, శీలం వెంకటరెడ్డి, కటికల సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నేతల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం 59వ డివిజన్‌లోని దానవాయిగూడెం కాలనీలో సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామంచికల్ జోన్ కన్వీనర్ సంగయ్య, మండల కమిటీ సభ్యులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు నల్లగొండ ముత్తయ్య, గోగుల కృష్ణ, తమ్మిశెట్టి సమ్మక్క, గోగుల ప్రసాద్, నల్గొండ పద్మ, నల్గొండ సుగుణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు యన్నం పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, పెద్ద గోపవరం సొసైటీ అధ్యక్షులు శీలం అక్కిరెడ్డి, నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గుర్తు హస్తం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని, ఎన్నికల మేనిఫెస్టోలోని 6 పథకాలను ప్రజలకు వివ రిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి వెంకట్‌రెడ్డి, తల్లపురెడ్డి రామిరెడ్డి, పెద్దమళ్ళ మో హన్రావు, ఖంభంపాటి లక్ష్మణరావు, బొగ్గుల వీరారెడ్డి, కర్నాటి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 44 ఓట్లు పోలింగ్

ఖమ్మం రూరల్ : పాలేరు నియోజకవర్గంలో సోమవారం మొదటి రోజు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 44 పోల్ అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరీ తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వారు పోలింగ్ కేంద్రాలకు రాలేని వారిని గుర్తించి 200 మందికి ఎన్నికల అధికారులు పోస్టల్ బ్యాట్ జారీ చేశారు. ఎన్నికల అధికారులు.. దివ్యాంగులు, వద్దుల ఇళ్లకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలింగ్‌ను ప్రారంభించారు. పాలేరు నియోజకవర్గంలో మొత్తం 200 ఓట్లు ఉండగా మొదటి రోజు 44 మందితో పోలింగ్ చేయించారు. మండలంలోని సత్యనారాయణపురం, తాళ్లేసెతండా గ్రామాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ పరిశీలించారు.

రైతులు సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తల్లాడ

రైతులు సీసీఐ కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలని వైరా మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్.ప్రసాద్ అన్నారు. సోమవారం తల్లాడలో సీసీఐ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన పత్తిని తీసుకుని వస్తే నిబంధనల ప్రకారం మద్దతు ధర లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా పత్తి కేంద్రానికి పత్తిని తీసుకొచ్చిన రైతును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సీనియర్ అసిస్టెంట్ గీతాబాయి, ప్రభుదాసు, భాష, బీరయ్య మిల్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ని అడ్డంకులు వచ్చినా పదికి పది గెలుస్తాం

- కాంగ్రెస్ 6 గ్యారెంటీలు ప్రజలు ఆశీర్వదిస్తారు
- రాజ్యసభ మాజీ సభ్యురాలు రేణుకా చౌదరి

నవతెలంగాణ-ఖమ్మం



ఎన్ని అండ్డంకులు వచ్చిన ఖమ్మంలో 10 కి 10 గెలుస్తామని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలు ప్రజలు ఆశీర్వదిస్తారని మాజీ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి అన్నారు. సోమవారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కష్టపడి యువకులు చదువుకుని పరీక్షలు రాస్తే పదే పదే లీకులు చేస్తూ ఉద్యోగం ఇవ్వలేని స్థితి ఈ అసమర్థత ప్రభుత్వానిది అని ఆరోపించారు. ఎదిగిన పిల్లలు ఉద్యోగం లేక ఇంటి నుండి బయటకి వెళ్ళలేక తల్లిదండ్రుల అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అందరూ విజయం సాధిస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 3 తేదీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు ఇంకా రైతుభంధు రాలేదని, ధర అడిగినందుకు రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అని ఆరోపించారు. సంభాని, యడవల్లి కృష్ణ ఇబ్బంది పడింది వాస్తవం అని, కానీ కొన్ని నిర్ణయాలు తీసుకునే ముందు కొంత ఇబ్బంది ఉంటుందని, పార్టీల పొత్తు ,కుల సమీకరణలు, పార్టీ అవసరాలు కూడా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని, త్వరలో వారు కూడా మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్ట్ విధానాన్ని మేము ఖండించామని అధి మీ అందరికీ తెలుసు అని అన్నారు. కొత్తగూడెంలో సిపిఐ పార్టీ తరఫున ప్రచారం చేస్తానని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో నగర కాంగ్రెస్ కమిటి కార్యనిర్వాహక అధ్యక్షులు దీపక్ చౌదరి, టిపిసిసి అధికార ప్రతినిధి కెవి.రత్నం, మాజీ ఏఎంసీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఎర్నేని రామారావు, నల్లమల వెంకటేశ్వరరావు, వడ్డేబోయిన నరసింహారావు, రామూర్తి నాయక్, చోటాబాబా తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ఎన్నికల కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం గెలుపును కాంక్షిస్తూ సోమవారం ఖమ్మం 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో ఎన్నికల కార్యాలయాన్ని సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు గద్దల పెంటయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ కన్వీనర్ పి.సంగయ్య, మండల కమిటీ సభ్యులు ప్రతాప్నేనీ వెంకటేశ్వర్లు, గద్దల జనార్ధన్, గద్దల రత్తమ్మ, గద్దల చిన్నప్ప, గద్దల వెంకన్న, గద్దల బుజ్జి, గద్దల వీరబాబు, గద్దల నరేష్, గద్దల బాబు, గద్దల రాజేష్, భాష పొంగు రవి, గద్దల శీను, గద్దల మహేష్, ఎల్లయ్య, కాంపాటి శ్రీను, గద్దల రాజు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌కే తమ మద్దతు

ఎరుకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతడి రాములు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

బీఆర్ఎస్ కే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూతాడి రాములు అన్నారు. మండల పరిధిలో సాయి గణేష్ నగర్ లోని కందాళ ఉపేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడారు. ఎరుకుల కుల అభివృద్ధి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. పాలేరులో ఉన్న ఎరుకల సోదర, సోదరీమణులు తమ ఓట్లన్నీ కందళా ఉపేందర్‌రెడ్డికే వేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ, నాయకులు పాలకుర్తి కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సత్తుపల్లి 'భవిత' సండ్రతోనే

- ఇంకెవరి వల్ల సాధ్యపడదు
- ప్రచారంలో సండ్ర మహాలక్ష్మి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి భవిత బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు ద్వారానే సాధ్యమని, ఇంకెవరి వల్ల కానేకాదని సండ్ర సతీమణి మహాలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కృషి బైపాస్ రోడ్డు, ఆరో వార్డు పరిధిలోని పాలవాడ, రాజబాపయ్య వీధి ప్రాంతాల్లో ఆమె బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంచుకుంటూ అందులోని అంశాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. సత్తుపల్లి ప్రజలు సండ్రను ఆదరించి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, నాలుగోసారి గెలిపించడం ద్వారా సత్తుపల్లికి ఉజ్వల భవిష్యత్తును సండ్ర తీసుకురావడం ఖాయమన్నారు. రానున్న సత్తుపల్లి భవిష్యత్తు ప్రజలే మద్దతుగా నిలిచి సండ్రను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని మహాలక్ష్మి ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ చైర్మెన్ వనమా శ్రీనివాసుదేవరావు, మల్లూరు అంకమరాజు, మాధురి మధు, షేక్ కాశీం, కోనేరు నాని, లక్ష్మణ్, రమేశ్, నరేంద్ర, చెన్నారావు, కౌన్సిలర్ మేకల భవాని, నాయకురాళ్లు రామిశెట్టి రాజేశ్వరి, ఇందిర, శోభ, కృష్ణవేణి, నాగమణి, రాణి, స్నేహ, భవిత పాల్గొన్నారు.

చంద్రబాబుకు రెగ్యూలర్ బెయిల్ ప్రకటనపై సండ్ర హర్షం

కల్లూరు : ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టైన స్కిల్ స్కాం కి సంబంధించి హైకోర్టు రెగ్యూలర్ బెయిల్ మంజూరుపై బీఆర్ఎస్ సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కల్లూరు పట్టణంలో విస్తృత ప్రచారం ఉండగా ఈ సమాచారం తెలవటంతో సండ్ర స్పందించారు. రాజకీయాల్లో ఎలాంటి మచ్చలేకుండా సుపరిపాలన అందించిన చంద్రబాబుకి హైకోర్టు బెయిల్ మంజూరు ఆనందంగా ఉందన్నారు.

వికలాంగులకు రాయితీ బస్ పాస్‌లు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని పెద్ద కోరుకొండ గ్రామంలో ఆ గ్రామ ప్రముఖ వైద్యులు వేము గంగరాజు సౌజన్యంతో ఆర్టీసీ వారు దివ్యాంగులు 50 మందికి రాయితీతో కూడిన బస్సు పాస్‌లు గ్రామ సర్పంపంచి వేము రత్తమ్మ సోమవారం అందజేశారు. సోమవారం గ్రామంలో బస్సు పాసుల మేళ నిర్వహించటానికి అవసరమైన దివ్యాంగులకు వేము గంగరాజ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, సిబ్బంది కంచి సాంసన్, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి కేరళ మోడల్

మొదటి పేజీ తరువాయి

ప్రస్తావన కూడా చేయకపోవడం దారుణమని అన్నారు. పోలవరం ముంపు, 5 పంచాయతీలు సమస్య ప్రస్తావనే లేదని అన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో బిఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య ఏం చేశాడని, ఏ కోలమానంతో ఓట్లు అడుగుతారు ప్రశ్నించారు. పోడు భూమి, ఉపాధి, తునికాకు బోనస్‌పై వీరయ్య ఏనాడైనా మాట్లాడాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇద్దరు అభ్యర్థులు స్పాన్సర్ క్యాండిడేట్లేనని ఆరోపించారు.

భద్రాచలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. అత్యంత సౌకర్యవంతమైన, ప్రశాంతమైన ప్రాంతం భద్రాచలం అని, అందుకు సీపీఐ(ఎం) అనేక త్యాగాలు చేసిందని అన్నారు. భద్రాచలం అభివృద్ధి కావాలంటే పోరాడేవారు కావాలని, సీపీఐ(ఎం) అభ్యర్థి కారం పుల్లయ్య గెలిస్తే భద్రాచలం ఔన్నత్యాన్ని కాపాడతామని, ఆదివాసీ హక్కుల కోసం పోరాడుతామని, గిరిజనేతర ప్రజల హక్కులను కాపాడత్తామని అన్నారు. సీపీఐ(ఎం) గిరిజన, గిరిజనేతర ప్రజల ఐక్యతను ముందుకు తీసుకుపోతుందని అన్నారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం) గెలిచే మొదటి సీటు భద్రాచలంమని అన్నారు.

27న బృందాకారత్ ప్రచారం

సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం అభ్యర్థి కారం పుల్లయ్య విజయాన్ని కాంక్షిస్తూ 25న త్రిపుర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ వాజేడు మండలం, భద్రాచలం పట్టణంలో పర్యటించనున్నారని, 27న రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందా కారత్, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్‌లు చర్ల, దుమ్ముగూడెం మండలాలలో జరిగే ప్రచార సభలో పాల్గొంటారని పార్టీ నియోజకవర్గం కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

మొదటి పేజీ తరువాయి

పనులను నిరంతర నిర్వేక్షణ చేస్తూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా మన్నలను పొందే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షణ భద్రాచలం ఆర్డీవో బందోబస్తు ఏర్పాట్లు పోలీస్ శాఖ చేపట్టాలని ఆదేశించారు. లాడ్జి హెూటల్ యజమానులతో సమావేశం నిర్వహించి ధరల నిర్ణయించాలని డీఎస్ఓకు సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీటీవీలో ఏర్పాటు చేయాలని చెప్పారు. భద్రాచలం, దుమ్ముగూడెం దేవాలయాలతో పాటు భద్రాచలం వంతెన కరకట్టను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు. భక్తుల మహెూత్సవాలు విక్షణకు ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హంస వాహనం తనిఖీ చేసి ధృవీకరణ నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈని ఆదేశించారు. వాహనంలోకి పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతించాలని చెప్పారు. భక్తులుకు బస్సులు, రైలు సమయాలను అలాగే జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలను తెలియజేయ విధంగా సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిపిఆర్ఓను ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహెూత్సవ రోజుల్లో 22, 23 తేదీల్లో మద్యం, మాంసాహారాలు నిలిపియాలని సమీప జిల్లాలు, రాష్ట్రాల నుంచి మద్యం నియంత్రణ చర్యలు చేపట్టాలని అబ్కారీ శాఖాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, డీఆర్ఓ రవీంద్రనాథ్, దేవస్థానం ఈవో రమాదేవి, డీపీఓ రమాకాంత్, డీసీఓ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈలు వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

నవతెలంగాణ-పినపాక

అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు బొడ్డు ఏసుబాబు తెలియజేశారు. సోమవారం పినపాక మండలం సింగిరెడ్డిపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం తరఫున కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లుగా తెలియజేశారు. మున్నూరు కాపులను గుర్తించి వారి అభివృద్ధికి తోడ్పడినది కేవలం కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఈ కార్యక్రమంలో తోట వెంకటేశ్వర్లు, బిక్షపతి, పరిమి వెంకటేశ్వరరావు, కొడాలి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండా ముద్దు బిడ్డ పుల్లయ్యను గెలిపించండి

జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రజా సేవే లక్ష్యంగా గత 20 ఏళ్లుగా ప్రజా ఉద్యమాల్లో కొనసాగుతున్న భద్రాచలం నియోజకవర్గ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్యకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగువాయిబాడువ, లక్ష్మీనగరం గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ కర పత్రాలను ఓటర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మడకం మహేంద్రనాద్, కల్లూరి శ్రీను, కొమరం చంటి, తులసి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్గో వస్తువుల వేలం

డిపో మేనేజర్ వెంకటేశ్వరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు సంస్థ కొత్తగూడెం డిపో ఆర్టీసీ కార్గోలో డెలివరీ కాని వస్తువులను గుర్తించి వేలం వేస్తున్నట్టు డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి కొత్తగూడెం కార్గోకు వచ్చిన పార్సిల్స్ డెలివరీ తీసుకెళ్లని చాలా వస్తువులను ఈ నెల 24 తేదీన శుక్రవారం సాయంత్రం 3 గంటలకు డిపో ఆవరణంలో వేలం వేయడం జరుగుతుందన్నారు. తీసుకువెళ్ళని వారు ఎవరైనా ఉంటే సరియైన ఆధారాలతో 24 తారీకు లోపు వచ్చి తీసుకుని వెళ్లాలని డిఎం కోరారు. కావున ఆసక్తి గలవారు 24వ తేదీన జరిగే ఈ వేలంపాటలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సీఎల్పీ నేత భట్టి, రాష్ట్ర నేతల రోడ్ షో...

దుమ్ముగూడెం : కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొదెం వీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ నేడు మండలంలో నిర్వహించనున్న రోడ్ షో..కార్నర్ సమావేశానికి సీఎల్పీ నేత భట్టి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణలు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

ఇరువురికి గాయాలు

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు ఎన్ఎస్పి రింగ్ సెంటర్ వద్ద ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే సోమవారం మృతి చెందాడు. కల్లూరు అంబేద్కర్ నగర్ కు చెందిన కొత్తపల్లి సీతారాములు తన ఆటోలో వాడపల్లి జోజి, కొత్తపల్లి కోడె దాసు, రవి, దాసరి సీతారాములు అనే వ్యక్తులతో కలిసి తిరువూరు వైపు నుండి కల్లూరు వస్తుండగా మార్గమధ్యంలోని ఎన్ఎస్పీ రింగ్ సెంటర్ వద్ద ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వాడపల్లి జోజి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా కొత్తపల్లి సీతారాములకు, కోడె దాసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మృతి చెందిన బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు విచారణ చేపట్టారు. వాడపల్లి జోజి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు . మృతుడి భార్య , కూతురు ఉన్నారు.

అధికారం ఇస్తే క్రిస్మస్‌లోపే దళిత బంధు అమలు చేస్తా

మొదటిపేజీ తరువాయి

పెట్టుకొని పని చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎన్నికలు వస్తాయని తెలిసి దళిత బంధు ప్రకటించారు అంటూ ఆరోపించడం సరికాదన్నారు. బిఎస్ఆర్ ప్రభుత్వం ఏర్పడితే తప్పనిసరిగా అమలు చేయించి మీ రుణం తీర్చుకుంటానన్నారు. కులాలకు మతాలకు రాజకీయలకు అతీతంగా అందరిని కలుపుకొని పనిచేసిన మీ అందరికీ సేవలందించాను అన్నారు. బోగస్ ప్రచార నమ్మొద్దని ఆలోచించి ఓటేయాలని కోరారు. 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకే మీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కొండూరి సుధాకర్, జడ్పీటీసి కట్టా అజయ్ కుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, ఈసీసీబీ డైరెక్టర్ బోబో లక్ష్మణరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండి. ఇస్మాయిల్, బోయిన దుర్గాప్రసాద్, కొండూరు కిరణ్ కుమార్, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, మేకల కృష్ణ, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

బీఆర్ఎస్ నాయకులు మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్, కొండూరు సుధాకర్ సమక్షంలో రాళ్ల బంజర చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య వారికి బి ఆర్ఎస్ కండవ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జెండాలు మార్చే వారిని ఓడించండి

(మొదటి పేజీ తరువాయి)

మంగ్యా తండా, హేలవాత్ తండా, ముజాయితిపురం, ఏనుకుంట తండా గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాలేరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్నటువంటి నాయకుల చరిత్ర చూసి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, డబ్బు సంచులతో వేలకోట్ల కాంట్రాక్టు, పనులు చేస్తూ అందులో అవినీతికి పాటుపడుతూ, సంపాదించిన అక్రమ సంపాదనతో ప్రజలను అంగడి సరుకులా కొనుగోలు చేసి ఓట్లు వేపిచ్చుకుందామని వారు భావిస్తున్నారని, అలాంటి డబ్బు రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలని, డబ్బు సంచులు పట్టుకొని ఏ పార్టీ అధికారంలోకొస్తే ఆ పార్టీలోకి, తనకు పార్టీ టికెట్ ఇవ్వకపోతే, వేరే పార్టీ లోకి వెళ్లడం, ఇలా రాజకీయాలలో ఊసరవెల్లిగా రంగులు మారుతున్న నాయకులను ప్రజలు తిరస్కరించాలని, జన సమస్యల కోసం, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి ప్రజాసంఘాల సమస్యలపైన నిరంతరం పోరాటం చేస్తూ ప్రజల మధ్యలో ఉన్నటువంటి కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ అభ్యర్థి అభ్యర్థినైనా నన్ను ప్రజలు ఆదరించి, ఆలోచించి ఓటు వేసి గెలిపించాలని తమ్మినేని వీరభద్రం కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, వశపొంగు వీరన్న, మోటపోతుల శ్రీను, పల్లి రమేష్, అన్న బత్తుల సత్తిబాబు, కొత్తపల్లి వెంకన్న, ఎగినాటి వెంకట్రావు, కోట ఉపేందర్ రెడ్డి, కోట శ్రీనివాసరెడ్డి, దొండేటి నిర్మల్ రావు, నాగటి సురేష్, దాసరి మహేందర్. తుళ్లూరు నాగేశ్వరరావు పల్లి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
04
ఖమ్మం
మంగళవారం | నవంబర్ 21 2023 | www.navatelangana.com

తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-నేలకొండపల్లి



సీపీఐ(ఎం) అసెంబ్లీ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని ముజ్జుగూడెం, అనాసాగరం, నాచేపల్లి, అమ్మగూడెం, కోనాయిగూడెం, గ్రామాలలో పార్టీ గ్రామ శాఖ ఆధర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తమ్మినేని ఎన్నికల కరపత్రాన్ని పంపిణీ చేస్తూ తమ్మినేని సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, కోరట్లగూడెం జోన్ కన్వీనర్ పగిడికత్తుల నాగేశ్వరరావు మాట్లాడుతూ కష్టజీవుల కోసం పోరాడే తమ్మినేని గెలిపించడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయన్నారు. గత పదేళ్లుగా చట్టసభలలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం లేకపోవడంతో పేదల సమస్యలపై చర్చించే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తమ్మినేనికి ఓటు వేసి అసెంబ్లీకి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఎడ్ల తిరుపతిరావు, శివరాజు, మందడి కోదండ రామారావు నున్న మధుసూదన్, బొడ్డు మధు, కూరపాటి ప్రసాద్, శాఖ కార్యదర్శి అడపాల రమణ, పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి నాగేశ్వరరావు, నరసయ్య, సంపత్, నాగేశ్వరరావు, బోయినపల్లి కొండలు, పార్టీ సీనియర్ నాయకులు వీరన్న, రామారావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని సంఘమిత్ర ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం



సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గం అభ్యర్థి తమ్మినేని వీరభద్రం గెలుపును కాంక్షిస్తూ సోమవారం ఖమ్మం 59 డివిజన్ లో తమ్మినేని వీరభద్రం తనయుడు తమ్మినేని సంఘమిత్ర ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లో నికర్స్ అయినా కమ్యూనిస్టు యోధురాలు రెడ్ సెల్యూట్ ఆమె అన్న మాటలు ఇప్పుడున్న వ్యవస్థలో కొంతమందికైనా కనువిప్పు కలిగించాలని ఓటు వేస్తే కమ్యూనిస్టుకి వేయాలని గుండె మీద చేయి వేసుకొని చెప్పారు. ఆమెకు లాల్ సలాం అన్నారు. ఈ కార్యక్రమంలో కామంచికల్ జోన్ కమిటీ కన్వీనర్ పి. సంగయ్య, పార్టీ మండల కమిటీ సభ్యులు ప్రతాపనేమి వెంకటేశ్వర్లు, నల్గొండ ముత్తయ్య, తేన రామ్మూర్తి, గూగుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి : వీహెచ్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి అని, ఎన్నో ఏళ్లుగా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంతరావు అన్నారు. ఖమ్మం, పాలేరు అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తు ఐఎన్టీయూసీ ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల ఆత్మీయ సమ్మేళనం మండల పరిధిలో సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల అనుకూల చట్టాలను చేస్తే...కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్త సీతారాములు మాట్లాడుతూ...బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని విస్మరించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కార్మికులకు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరేశ్, మోహన్ నాయుడు, మోహన్‌రావు, విప్లవకుమార్, రావుల శ్రీను, చంద్రయ్య వెంకటరెడ్డి, గోపి, ఉపేందర్, రవీందర్, భద్రం, రాములు, బాబు, ప్రభాకర్, సైదులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దగోపతి విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల స్థాయి టగ్ ఆఫ్ వార్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరచడంతో అండర్/17 ,14 లకు ప్రదీప్, చైతన్య, అనిల్, కార్తీక, సుప్రియ, దీక్షిత, సంజన, మధు శ్రీ,, ఉషా, అమూల్య రాష్ట్రస్థాయికి ఎంపికైనారు. అదేవిధంగా స్టాండ్ బై గా దిలీప్, రాంచరణ్, శ్రేష్ట, పవిత్ర, మనీషా, మేఘన ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.మార్క్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అకాక్షించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ రంజాన్, ఉపాధ్యాయులు కేవీఎల్ నరసింహారావు, కటారు. శ్రీనివాసరావు, ఎన్ .శ్రీనివాసరావు , షేక్ ఇస్మాయిల్ , జీడిఎస్వి రమణ, , శ్రీధర్ బాబు, జే . రవి, సాంబచారి, వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు, రాంబాబు, ఎస్.అంజనాదేవి, ఎన్. శైలజ, కే .భాగ్యలక్ష్మి, సునీతరాణి, మైబు విద్యార్థులు వారి అభినందించారు.

డాక్టర్ 'కొనకళ్ల'కు జాతీయస్థాయి పురస్కారం

సత్తుపల్లి : సత్తుపల్లికి చెందిన సనాతన ఆయుర్వేద వైద్యురాలు, సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణికి నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ జాతీయస్థాయి పురస్కారంంతో సత్కరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ చేతుల మీదుగా సుధారాణి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ గౌరిశంకర్, నర్సాపూర్ మండల మైనారిటీ సెల్ ఛైర్మెన్ గౌస్‌పాష, పేరడీ సింగర్ గురుస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొనగా నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ అధ్యక్షులు అర్జున్, నరేందర్ గౌడ్ పాల్గొన్నారని సుధారాణి తెలిపారు. సేవలను గుర్తించి పురస్కారాన్ని అందించిన ఢిల్లీ కల్చరల్ అకాడమీకి ఈ సందర్భంగా సుధారాణి ధన్యవాదాలు తెలిపారు.

అజయ్ కుమార్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలో 53వ డివిజన్‌లో కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య నాగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ డివిజన్ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ ప్రజలు అజయ్ కుమార్‌పై ఉన్న అభిమానంతో ఇంటింటికీ మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో సబ్బండ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు విరివిగా అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పథకాల తో పాటు ఇంకా అనేక మంచి పథకాలు పార్టీ ప్రవేశ పెట్టనున్నదని తెలిపారు. నాపై విశ్వాసముంచి గెలిపించినందుకు ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్లు, డ్రైన్‌లు, విద్యుత్ దీపాలు, నిరంతర చెత్త సేకరణ కోసం వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. డివిజన్‌లో ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలు కల్పించి ఇంటింటికీ త్రాగునీరు అందిస్తున్నామని, ఇంకా మరింత అభివృద్ధి చేసేందుకు మరొక సారి అవకాశం కల్పించాలని కోరారు. మూడు బ్యాలెట్ బాక్స్ లు ఉన్నాయని, మొదటి బ్యాలెట్‌లో మొదటి గుర్తు అయిన మన కారు గుర్తు పై తమ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఖమ్మంలో నకిలీఖాన్ తిరుగుతున్నాడు

- **మైనార్టీలను వేధింపులకు గురి చేయడమే అతడి లక్ష్యం**
- **ఏఐసీసీ సభ్యుడు ఇమ్రాన్ ప్రతార్ గర్హి**

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో నకిలీఖాన్ తిరుగుతున్నాడని, మైనార్టీలను వేధింపులకు గురి చేయడమే అతడు లక్ష్యంగా పెట్టుకున్నాడని, ఇలాంటి వారికి ఈ నెల 30న ముస్లిం సోదరులు ఓటుతో సమాధానం చెప్పాలని రాజ్యసభ, ఛైర్మన్ మైనార్టీ డిపార్టుమెంట్, ఏఐసీసీ సభ్యుడు ఇమ్రాన్ ప్రతార్ గర్హి అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని సీక్వెల్ రిసార్ట్లో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ ముస్లిం మైనార్టీలు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ ముస్లిం మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేశాడని, కేసీఆర్, మోడీ ఒకటేనని అవసరం వచ్చిన ప్రతిసారి ఇద్దరు ఒకరికొకరు మిత్రుల్లా నిలబడతారన్నారు.ఖమ్మంలో అక్రమాలకు పాల్పడుతున్న పువ్వాడ అజయ్ ను రాజకీయాల నుంచి బర్తరఫ్ చేయాలని, ఈ నెల 30న మైనార్టీలు ఓటుతో పువ్వాడపై ప్రతీకారం తీర్చుకోవాలని, ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు పోటీ చేస్తున్నారని రాజకీయాల్లో మచ్చ లేని తుమ్మలను మైనార్టు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి అజారుద్దీన్ మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరరావు ఒక వజ్రం లాంటి వారని ఆయనను గెలిపించుకోవడంలో మైనార్టీలు కృషి చేయాలన్నారు. మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి మాట్లాడుతూ ఖమ్మంలో అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్కుమార్కు ముస్లిం మైనార్టీలు, ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్. అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జువిద్, కార్పొరేటర్లు కమరపు మురళి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జాన బి. రఫీదాబేగం, ముస్తఫా, ముస్లిం మైనార్టీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

'మిస్ట్' విద్యార్థుల సరికొత్త ఆవిష్కరణలు

- 24 గంటల పాటు ఏకథాన్ నిర్వహణ - 22 వెబ్‌సైట్స్ ఆవిష్కృతం

సత్తుపల్లి : సత్తుపల్లిలోని కొత్తూరు మదర్ థెరెసా ఇంజనీరింగ్ కళాశాల సీఎస్‌సీ విభాగానికి చెందిన విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలకు తెరలేపారు. 24గంటల పాటు ఏకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలి ఏకథాన్ నిర్వహించిన కళాశాలగా గుర్తింపు వచ్చిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 11:30 గంటల నుంచి సోమవారం 11:30గంటల వరకు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన బ్రైనోవిజన్ ప్రయివేట్ లిమిటెడ్ వారి పర్యవేక్షణలో 24గంటల్లో 22 వెబ్‌సైట్స్‌ను సమాజానికి ఉపయోగపడే విధంగా విజయవంతంగా తయారు చేసినట్టు పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంలో విద్యార్థులు 22 గ్రూపులుగా పాల్గొన్నారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్య ప్రదర్శనకు ప్రథమ, ద్వితీయ బహుమతులను బ్రైనోవిజన్ సంస్థ అందించిందని హరికృష్ణ చెప్పారు. ఇవేగాక మరో 10మంది విద్యార్థులకు నెలకు రూ. 10వేలు ఇంటెన్షిప్ గెల్చుకున్నారన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగు తీసుకొస్తాయి

ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగు తీసుకొస్తాయని ఆ పార్టీ ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని 50, 51 డివిజన్‌లో తుమ్మల నాగేశ్వరరావు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో అరాచకం రాజ్య మేలుతోందన్నారు. భూ కబ్జాలు పోలీస్ అక్రమ కేసులతో జనం విసుగెత్తి పోయారన్నారు. బెదిరించే వారి పేర్లు రాసుకోండి వారి సంగతి చూద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, రాయల నాగేశ్వరావు, శెట్టి రంగారావు, రవి, వీరన్న, నాయకులు లింగం నరేందర్, శంకర్‌రావు, ఉమర్, శ్రీనివాసరావు, కరుణ, రాజు పాల్గొన్నారు.

జాతీయ మైనార్టీ ఛైర్మెన్‌ను కలిసిన షేక్ జిలాని

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నియోజవర్గ పరిధిలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో ఖమ్మం నియోజవర్గ స్థాయి మైనారిటీ విభాగం, టౌన్ అధ్యక్షులు జావిద్ ఆధ్వర్యంలో జరిగిన మైనారిటీ ఆత్మీయ సమ్మేళనంలో అతిధులుగా ఖమ్మం నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్టార్ కాంపైనర్ అజారుద్దీన్లు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజ్య సభ ఎంపీ. ఇమ్రాన్ ప్రతాప్ ఘర్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకులు షేక్ జిల్లాని కలిసి పుష్పగుచ్ఛం సమర్పించి ఖమ్మం జిల్లాలో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ స్థితిగతులను, జిల్లాలో రాబోవు సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను చర్చించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులు ఇంటి వద్ద నుండే ఓటు వేయవచ్చు

నవతెలంగాణ-వైరా

వికలాంగులు ఇంటి వద్ద నుండే ఓటు వేయవచ్చు అని ఆర్ఓ సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం వైరా నియోజకవర్గంలో వికలాంగులకు బ్యాలెట్ పత్రంపై ఇంటి వద్దనే ఓటు వేసే విధానాన్ని రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ సత్య ప్రసాద్ ప్రారంభించారు. నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల ఏనుకూరు జూలూరుపాడు, కారేపల్లి, మండలాల్లో 230 మంది దివ్యాంగులను ఎన్నికల అధికారులు గుర్తించారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు 50 మంది పోలింగ్ ఆఫీసర్లు పోలీస్ సిబ్బందిని రిటర్నింగ్ అధికారి నియమించారు. పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి ఎన్నికల సామాగ్రిని అందజేశారు. వైరాలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మొట్టమొదటి ఓటును దివ్యాంగుడు షేక్ ఇబ్రహీం కుటుంబ సభ్యుల సహకారంతో ఓటును వినియోగించుకున్నాడు. ఈ కార్యక్రమంలో పోలింగ్ ఏజెంట్లు ఎన్నికల అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో... 'టాలెంట్ స్కూల్' విద్యార్థినులకు తృతీయస్థానం

నవతెలంగాణ-సత్తుపల్లి

శ్రీసత్యసాయి సేవాసమితి వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్తుపల్లికి చెందిన టాలెంట్ స్కూలు విద్యార్థినులు తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. బాల వికాస్ పిల్లలైన ఈ పాఠశాల విద్యార్థి ఎస్కే.సమీర గ్రేడ్-2 హిందీ విభాగంలో తృతీయస్థానం సాధించగా తాళ్ల ఆశ్రిత జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి ఆ సేవాసమితి కన్వీనర్ చీకటి వెంకటరామారావు చేతుల మీదుగా జ్ఞాపికతో పాటు ధ్రువపత్రాన్ని అందుకున్నారు.



ప్రజా గొంతుకుని అసెంబ్లీకి పంపండి

నవతెలంగాణ- కూసుమంచి

ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజల హక్కులకై తన వాణిని చట్టసభల్లో వినిపించే దమ్ము, ధైర్యం ఉన్న వ్యక్తి తమ్మినేని వీరభద్రం అని, అలాంటి గొంతుకను అసెంబ్లీకి పంపాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా పాలేరు సమస్యలపై పాలేరు సస్యశ్యామలం కోసం దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి జిల్లాలను పాలేరు జలాశయంలో కలపాలని పాదయాత్ర నిర్వహించిన మహా నాయకుడు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించి, ప్రజల కోసం తూటాలకు ఎదురు వెళ్లి ప్రజల కోసం పనిచేసే నాయకుడని, ఇలాంటి నాయకుడిని, పేద ప్రజల హక్కుల కోసం, చట్టసభల్లో తన వాణిని వినిపించి ప్రజలకు ఉపయోగపడే చట్టాలను రూపొందించడంలో, ప్రభుత్వాలు మెడలు వంచైనా సరే వారి కోసం, చట్టాలు తీసుకురావటంలో ముందు ఉంటారని, అలాంటి గొంతుకను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు శీలం గురుమూర్తి, రాజు, గంగాధర్, లింగయ్య గన్య నాయక్, బాస్ నాయక్, రాధాకృష్ణ, వెంకన్న, శ్రీను, పాల్గొన్నారు.

ఎరుపుమయంతో 'పాలడుగు' కు ఘన స్వాగతం

నవతెలంగాణ - బోనకల్

సిపిఎం మధిర నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పాలడుగు భాస్కర్ కు మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ తూటికుంట్ల లక్ష్మీపురం గ్రామాలలో ప్రజలు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. గోవిందపురం ఎల్ గ్రామంలో గ్రామ శివారులో మహిళలు ఎర్ర చీరలు, పురుషులు ఎర్ర చొక్కాలు ధరించి, సిపిఎం జండాలను చేత పట్టుకొని పాలడుగు భాస్కర్ కు ఘన స్వాగతం పలికారు. గోవిందపురం ఎల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జాతీయ కోశాధికారి మందడపు సాయిబాబు పాలడుగు భాస్కర్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడారు. తొలుత ఇటీవల కాంగ్రెస్ గుండాల దాడిలో హత్యకు గురైన సిపిఎం కార్యకర్త ఎర్రబోయిన నాగేశ్వరరావు స్థూపానికి పాలడుగు భాస్కర్, మందడపు సాయిబాబు, పొన్నం వెంకటేశ్వరరావు సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని నారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా అమరజీవి జొన్నలగడ్డ రామయ్య స్థూపానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోనే ప్రధాన రహదారి గుండా పెద్ద ఎత్తున సిపిఎం శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా లక్ష్మీపురం తూటికుంట గ్రామాలలో కూడా గ్రామ శివారులో పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. పాలడుగు భాస్కర్ ను గెలిపించాలంటూ బుడతడు సైకిల్ మీద గ్రామంలో ప్రచారం నిర్వహిస్తూ ర్యాలీలో ఆకర్షణగా నిలిచాడు. ఈ ప్రచార కార్యక్రమంలో లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత నాయకులు కారంగుల చంద్రయ్య, కళ్యాణపు శ్రీనివాసరావు, కళ్యాణపు బుచ్చయ్య, పొన్నం రాంబాబు, బండి చంద్ర రావు, నల్లమోతు వాణి, గుద్దూరి వెంకట నరసయ్య, గుద్దూరి ఉమ, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్ సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ నాయకులు నోముల పుల్లయ్య, పాపినేని అప్పారావు, పాపినేని రమేష్, పాపినేని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

హరిప్రియ గెలుపునకు విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కామేపల్లి

పండితాపురం గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ బిఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికి తిరిగి ముమ్మర ప్రచారం చేశారు. కార్యక్రమంలో మూడు కృష్ణ ప్రసాద్ నాయక్, ఉపసర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు, దండగల దేవేందర్, ధనియాకుల మాధవ్, చల్ల హరి, బానోత్ రాములు, దొడ్ల మల్లేష్, దూగంట్ల వీరన్న, ఐతనబోయిన నాగేశ్వరరావు, పసుమర్తి సత్యనారాయణ, బొగారపు అశోక్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ అజయ్ గెలుపు కోసం సైకిల్ యాత్ర

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం నగరంలో సోమవారం స్థానిక ప్రెస్క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అజయ్ అన్న సైన్యం నాయకులు గుండ్ల విజయ్ భవాని, త్రీ టౌన్ బీసీ సెల్ సెక్రెటరీ నాగన్న బోయిన నాగరాజులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు యాదవ్ ఆదేశాల మేరకు పువ్వాడ అజయ్ అన్న గెలుపే లక్ష్యంగా ఖమ్మం 60 డివిజన్లు మరియు రఘునాథపాలెం మండలంలో 20 సైకిళ్ళతో సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్నామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బైపాస్ రోడ్డు శ్రీ శ్రీ హొటల్ దగ్గర నుండి ఈ సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వేముల కార్తీక్‌కుమార్, ఎమ్‌డి మున్నా, ఎస్‌కె నాజ్, వెంకీ, రాజేష్, వరుణ్, రామకృష్ణ, కళ్యాణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పేపర్ల లీకేజీల ప్రభుత్వాన్ని ఓడించాలి

- కేసీఆర్ బినామీ భట్టిని ఓడించాలి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు బుద్ధిచెప్పాలి
- ఉదయించే ఉద్యమాల సూర్యుడు పాలడుగు భాస్కర్‌ని గెలిపించాలి
- సిఐటియు ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు పిలుపు



నవతెలంగాణ -ఎర్రుపాలెం

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లకు వెళ్లి కష్టపడి చదువుకొని ఉద్యోగాలు సంపాదించాలనే ఆశతో పరీక్షలు రాస్తే పరీక్ష పేపర్లను లీకేజీ చేసిన ప్రభుత్వాన్ని ఓడించాలని, శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలు అవకాశం ఇస్తే తాను పోషించవలసిన పాత్రను పోషించకుండా కెసిఆర్‌కి బినామీగా వ్యవహరిస్తున్న భట్టి విక్రమార్కుని ఈ ఎన్నికలలో ఓడించాలని సిఐటియు ఆల్ ఇండియా కోశాధికారి సాయిబాబు ఓటర్లకు పిలుపు నిచ్చారు. మండల కేంద్ర మైన ఎర్రుపాలెం రామిశెట్టి పుల్లయ్య భవనం నందు జరిగిన విలేకరుల సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరిగే 119 శాసనసభ ఎన్నికలలో కార్మిక రైతాంగ ప్రజా సమస్యల పరిష్కారం ప్రాతిపదికపైన ప్రజలు తీర్పు నివ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేని బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడోసారి జరిగే ఎన్నికలలో చిత్తుగా ఓడించి తిరస్కరించాలని అన్నారు. పలు కార్మిక సంఘాలు నెలల తరబడి సమ్మె చేస్తుంటే వారితో చర్చలు జరపవద్దని కెసిఆర్ హుకుం జారీ చేశారని, యూనియన్ నాయకులు రాకుండా ప్రగతి భవనం తలుపులు మూసి వేశారని అన్నారు. సమ్మె బాట పట్టిన కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించారని పలు సంఘాల యూనియన్లకు వ్యతిరేకంగా నిరంకుశ నియంత పరిపాలనను అంతమొందించాలని అన్నారు. కాంటాక్ట్ ఉద్యోగుల వ్యవస్థను రద్దు పరుస్తానని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పిన కేసీఆర్ కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులకు ద్రోహం చేశారని విమర్శించారు. కొనసాగుతున్న సబ్సిడీలను ఎత్తివేసి గ్యాస్ సిలిండర్ ధరలు 1200 రూపాయలకు పెంచి ఎన్నికల సమయంలో 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇస్తానని చెబుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోడీ పెద్ద దొంగ అని, కెసిఆర్ చిన్న దొంగ అని దొందు దొందే అన్నారు. రేషన్ కా ర్డులు ఇవ్వడం చేతకాని వాడు సన్న బియ్యం ఇస్తాన ని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించి ప్రజా సమస్యల పైన వెలుగెత్తి పోరాడే పాలడుగును గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు రాజారావు, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, జిల్లా రైతు సంఘం నాయకులు దివ్వెల వీరయ్య, మండల సిఐటియు ఆర్గనైజర్ సగుర్తి సంజీ వరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గామాసు జోగయ్య, వృత్తిసంఘం నాయకులు నాగులవంచ వెంకటరామయ్య, కోటి సుబ్బారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

ఇల్లందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య

నవతెలంగాణ-కామేపల్లి

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన అని కాంగ్రెస్ జిల్లా నాయకులు మువ్వా విజయ్ బాబు, కాంగ్రెస్ పార్టీ ఇల్లందు అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. కామేపల్లి మండలంలో కోరం.కనకయ్య విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని జోగూడెం, తాళ్లగూడెం, టేకులతండా, పింజర మడుగు, పాత లింగాల, నెమలిపురి, గోవిందరాల, బండిపాడు, పొన్నెకల్లు, బర్లగూడెం, గరిడేపల్లి గ్రామాలలో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లు కార్యకర్తలు అడుగు అడుగున అపూర్వ స్వాగతం పలికారు. మద్దులపల్లి ఎంపీటీసీ గబ్రూనాయక్ బిఆర్ఎస్ పార్టీకి గుడ్ బాయ్ చెప్పి కాంగ్రెస్ పార్టీలో కోరం కనకయ్య సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర నాయకులు రామ్‌రెడ్డి చరణ్ రెడ్డి, ఏపూరి మహేందర్ కుమార్, వైఎస్ఆర్ టీపి ఇల్లందు నియోజకవర్గనాయకురాలు సుజాత మంగిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.కార్యక్రమంలో మండల అద్యక్షులు గింజల నర్సిరెడ్డి, మాజీ ఎంపిపి జర్పల లక్ష్మణ్‌నాయక్, మేకల మల్లిబాబుయాదవ్, అప్పన పిచ్చయ్య, ఎంపీటీసీలు రాంరెడ్డి జగన్నాధరెడ్డి, నల్లమోతు .లక్ష్మయ్య, సునిత లక్ష్మీనారాయణ, నర్సింహానాయక్, ఎం.మహేష్, శంకర్ పూల్ సింగ్, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మలపాటి సత్యం, సర్పంచ్ సునిత తదితరులు పాల్గొన్నారు.



పొంగులేటికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మద్దతు

- ప్రతి ఉద్యమకారుడు హస్తం గుర్తుపై పది ఓట్లైనా వేయించాలి..
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి.కృష్ణారావు

నవతెలంగాణ - కూసుమంచి

పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మద్దతిస్తున్నట్లు రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి.కృష్ణారావు తెలిపారు. కూసుమంచిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్‌కు రెండుసార్లు అధికారాన్ని కట్టబెట్టినా తెలంగాణ ప్రజల ప్రయోజనాలను గాలికి వదిలేశారని అన్నారు. ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని తెలిపారు. కెసిఆర్ పాలనలో ల్యాండ్, లిక్కర్, డ్రగ్స్, ఇసుక మాఫియాలు విపరీతంగా పెరిగాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి బట్టబయలవుతుందన్నారు. కెసిఆర్ కుటుంబం తెలంగాణ ఖజానాను ఖాళీ చేసి రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పులపాలు చేసిందన్నారు. ఫలితంగా ప్రతి పౌరుడిపై రూ.1.25 లక్షల అప్పుల భారం పడుతోందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు కృతజ్ఞతగా ప్రతీ ఉద్యమకారుడు తనవంతుగా ఒక్కొక్కరు 10 ఓట్లు హస్తం గుర్తుకు వేపియాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ విజయానికి కృషి చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా కన్వీనర్ బచ్చాల పద్మాచారి, నాయకులు భూక్యా రాంబాబు నాయక్, భూక్యా శ్రీనివాస్ నాయక్, బట్టు రాజేందర్ నాయక్, బెల్లంకొండ నాగేశ్వరరావు, యాదగిరి చారి, సంగయ్య , సైదులు, దొడ్డ శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి ప్రజా సమస్యలను ప్రస్తావించే వారిని పంపండి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- తల్లాడ



అసెంబ్లీలో ప్రజా సమస్యలు ప్రస్తావించే వారిని శాసన సభ్యులుగా పంపించాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తల్లాడ మండలంలో సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ సిపిఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి విజయాన్ని కాంక్షిస్తూ కలకొడిమ గ్రామంలో నున్నా నాగేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు ఒక తాను గుడ్డలేనన్నారు, రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బిజెపికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేననీ తెలిపారు. నిజాయితీపరులైన కమ్యూనిస్టులను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ప్రజలను కోరారు. సిపిఎం నాయకులు అసెంబ్లీ, పార్లమెంట్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని మాచర్ల భారతిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాచర్ల భారతి మాట్లాడుతూ తెలంగాణ కమ్యూనిస్టుల కంచుకోట అని, అలాంటి రాష్ట్ర అసెంబ్లీలో కమ్యూనిస్టులు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రశ్నించే గొంతుకులను చట్ట సభలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు సాగిస్తూ ప్రశ్నించే గొంతుకులైన కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించి చట్టసభలకు పంపాలని కోరారు. సోమవారం మండల పరిధిలోని కేశవాపురం, బస్వాపురం, తల్లాడ తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇంచార్జ్ మాదినేని రమేష్, అయినాల రామలింగేశ్వరరావు, నల్లబోతు మోహన్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, శీలం పకీరమ్మ, చల్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, అవకాశవాద, ఫిరాయింపు రాజకీయాలను ఓడించండి

- సీపీఐ(ఎం)కు ఓటు వేయండి..ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి
- సీపీఐ(ఎం)అభ్యర్థి భూక్యా వీరభద్రంను గెలిపించండి
- అసెంబ్లీలో మాట్లాడుతాం...బయట పోరాడుతాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరాటౌన్



డబ్బు రాజకీయాలు, అవకాశవాద రాజకీయాలు, ఫిరాయింపు రాజకీయాలను ఓడించాలని, ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని, సిపిఐ(ఎం)కు ఓటు వేస్తే ప్రజాస్వామ్యం గెలుస్తుందని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం వైరా పట్టణంలో సిపిఐ(ఎం) వైరా అసెంబ్లీ అభ్యర్థి ముఖ్య వీరభద్రం ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల గురించి మాట్లాడే వారు ఎవరూ, పరిష్కరించాలని ప్రభుత్వాలను నిలదీసే వారు ఎవరూ, అభివృద్ధి కోసం ప్రభుత్వాలను ప్రశ్నించే వారు ఎవరూ అని ఆలోచించి ఓటు వేయాలి కోరారు. గండగలపాడు గ్రామానికి చెందిన బోడేపూడి వెంకటేశ్వరరావు మధిర నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సిపిఐ(ఎం) శాసనసభ పక్ష నేతగా రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులు, చిన్న వ్యాపారాలు, ప్రజలందరి సమస్యల పైన గొంతెత్తి మాట్లాడి పరిష్కారం కోసం ప్రభుత్వాలను ఒప్పించే వాడిని, ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించిన చరిత్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. వైరా నియోజకవర్గంలో మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో సిపిఐ(ఎం) అభ్యర్థి తప్పా, గెలిచిన వాళ్ళు, ఓడిన వాళ్ళు అందరూ పార్టీలు ఫిరాయించారని, 2009, 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన చంద్రావతి, మదన్‌లాల్, రాముల నాయక్ ముగ్గురు ఎమ్మెల్యేలు ఒకే కారు ఎక్కి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు గెలిచే వాళ్ళు ఎవరైనా సరే మళ్ళీ కారెక్కే ప్రమాదం ఉందని తెలిపారు.చైతన్యవంతమైన వైరా ప్రజలు, వ్యాపారస్తులు ఆలోచించాలని, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పైన ఓట్లు వేయాలని, భూక్యా వీరభద్రం ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భూక్యా వీరభద్రం 42 సంవత్సరాల వయస్సులో 22 సంవత్సరాలు ప్రజా సమస్యల పైన పోరాడిన అనుభవం ఉందని, గిరిజనులు, రైతులు, కార్మికులు, కూలీలు, పేద ప్రజల సమస్యల మీద పోరాడుతున్న పోరాట యోధుడు భూక్యా వీరభద్రం అని కొనియాడారు. భూక్యా వీరభద్రంను గెలిపిస్తే పార్టీ ఫిరాయించడని, ఎమ్మెల్యే గిరిని అమ్ముకోడని, ప్రలోభాలకు లొంగడని, పైరవీలు చేయడని హామీ ఇచ్చారు. పోడు పోరాటంలో ఆరు నెలలు చర్లపల్లి జైలులో నిర్బంధించినా భయపడకుండా తిరిగి వచ్చి మళ్ళీ ఎర్రజెండా పట్టుకున్నాడని, లాఠీ దెబ్బలకు భయపడడని, ప్రజలకోసం జైలుకు వెళ్ళడానికైనా, ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడతాడని అన్నారు.

కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు పారుపల్లి ఝాన్సీ, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, బోడపట్ల రవీందర్, మల్లెంపాటి రామారావు, మచ్చా మణి, బొంతు సమత, గుడిమెట్ల రజిత, భూక్యా విజయ, హరి వెంకటేశ్వరరావు కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, సంక్రాంతి నరసయ్య, గుడిమెట్ల మోహన్‌రావు, గుమ్మా నరసింహారావు, పారుపల్లి కృష్ణారావు గురుగుంట్ల శ్రీనివాసరావు, మల్లెంపాటి ప్రసాదరావు, షేక్ జమాల్ సాహెబ్, మాడపాటి మల్లికార్జునరావు, బాణాల శ్రీనివాసరావు, ఓర్సు సీతారాములు, ఎనమద్ది రామకష్ణ, వడ్లమూడి మధు, రుద్రాక్షుల నరసింహచారి, దేవబత్తి నరసింహారావు, నూకల వెంకటేశ్వరరావు, చిత్తారు మురళి, షేక్ నాగుల్ పాషా, పాపగంటి రాంబాబు, దేవుళ్ళ కష్ణ, చావా కళావతి, బందెల అమతమ్మ, దేవబత్తిని లక్ష్మీతులసి, దేవబత్తిని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన పార్టీలోనే ఉంటామని హామీ ఇస్తారా..?

సత్తుపల్లి సీపీఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి

నవతెలంగాణ-తల్లాడ



గెలిచిన పార్టీలోనే ఉంటామని రాజకీయ నాయకులు హామీ ఇస్తారా అంటూ సత్తుపల్లి నియోజకవర్గ సిపిఐ(ఎం) అభ్యర్థి మాచర్ల భారతి సవాల్ చేశారు. సోమవారం తల్లాడ పట్టణంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ నాయకులను ఉద్దేశించి ప్రస్తుతం మీరు ఇస్తున్న హామీలన్నీ బాగానే ఉన్నాయి కానీ, వీటితో పాటు ప్రజలకు ఇంకొక హామీ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మీరు ఏ పార్టీతో గెలుపొందుతారు ఆ పార్టీ తరఫున నిలకడగా ఐదు సంవత్సరాలు ఉండి ప్రజల పక్షాన పోరాడతారా అని సవాల్ విసిరారు. ప్రజల పక్షాన, విద్యార్థి, యువజన నాయకుల పట్ల, రైతులు, వ్యవసాయ కూలీలు సమస్యల పట్ల 24 గంటలు స్పందించే సిపిఎంకు ఓట్లు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కాలంలో చట్టసభల్లో ప్రజల సమస్యల పట్ల ప్రశ్నించే గొంతుకలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బూర్జువా పార్టీలు ఆర్థిక, అంగ బలంతో కమ్యూనిస్టులను చట్టసభల్లోకి రాకుండా అడ్డుకొని నిరంకుశంగా పాలన చేస్తున్నారని, పాలకుల నిరంకుశ పాలన విధానాలను అడ్డుకోవడానికి చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండి తీరాలన్నారు, చట్టసభల్లో కమ్యూనిస్టుల, ప్రాతినిద్యాన్ని, గణనీయంగా పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో తల్లాడ మండల ఇంచార్జ్ మాదినేని రమేష్, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, సీనియర్ నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, మండల నాయకులు శీలం పకీరమ్మ, తమ్మిశెట్టి నాగమణి, చల్ల నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్,షేక్ మస్తాన్, నల్లమోతు మోహన్ రావు, పులి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పట్టని కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించండి

- సీఐటీయు జాతీయ కోశాధికారి మందడపు సాయిబాబు
- కార్మిక హక్కుల కోసం పోరాడుతా
- సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ - బోనకల్



ఎర్రజెండా ముద్దుబిడ్డ సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్‌ను గెలిపించడం ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, నియోజకవర్గ అభివృద్ధి తిరిగి ప్రారంభం అవుతుందని సిఐటీయు జాతీయ కోశాధికారి మందడపు సాయిబాబు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు ఓటర్లను కోరారు. మండల పరిధిలోని జానకిపురం, చిన్నబీరవల్లి, సీతానగరం, రాపల్లి, బ్రాహ్మణపల్లి, రామాపురం, గార్లపాడు గ్రామాలలో సిపిఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయం కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ రోడ్ షో నిర్వహించారు. ఎన్నికల ప్రచార సభలలో మందడపు సాయిబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క, బీఆర్ఎస్ అభ్యర్థిగా లింగాల కమల్ రాజు వీరిద్దరూ ఇప్పటికే ఒకరు ఎమ్మెల్యేగా మరొకరు జిల్లా పరిషత్తు చైర్మన్‌గా పదవిలో ఉన్నారన్నారు. పదవిలో ఉన్నవారు ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, కాని ఇప్పుడు తమను గెలిపిస్తే మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ప్రజలను మోసం చేస్తూ మాయ మాటలు చెబుతున్నారని, ఆ మాయమాటలను తిప్పి కొట్టాలని ఓటర్లను కోరారు. బోడేపూడి వెంకటేశ్వరరావు వారసుడిగా పాలడుగు భాస్కర్ పోటీ చేస్తున్నారని, పాలడుగు భాస్కర్ విజయంతోటే మధిర నియోజకవర్గ అభివృద్ధి తిరిగి ప్రారంభం అవుతుందన్నారు. మల్లు భట్టి విక్రమార్క మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మధిరకు చేసింది ఏమిటో, జిల్లా పరిషత్తు చైర్మన్ కమల్ రాజు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తాము చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పకుండా తాము అభివృద్ధి చేస్తామని చెప్పటం మరల ప్రజలను మోసం చేయటమేనన్నారు. మీ ఓట్లతో గెలిచి మిమ్మలను మోసం చేస్తున్న భట్టి విక్రమార్క, లింగాల కమల్ రాజులను ఈ ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ మధిర మాజీ ఎమ్మెల్యే బోడెపుడి వెంకటేశ్వరరావు వారసుడిగా ఎర్రజెండా ప్రతినిధిగా, కార్మిక సంఘం నాయకుడిగా మీ ముందుకు వస్తున్నానని, మీ సమస్యల పరిష్కారమే నా ఏజెండాగా నిరంతరం పనిచేస్తానని సిపిఎం మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాలడుగు భాస్కర్ అన్నారు. సిఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాను కార్మికుల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించామన్నారు. ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికుల, అంగనవాడి కార్యకర్తలు, జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శుల, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, అనేక రంగాల కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న తనను గెలిపించాలని ఆయన కోరారు. మల్లు భట్టి విక్రమార్క, లింగాల కమల్‌రాజు మధిర నియోజకవర్గానికి ప్రజాప్రతినిధులుగా ఉండి ఏం చేశారో మీ అందరికీ తెలుసునని మరల వారిని గెలిపించి మధిర అభివృద్ధికి ఆటంకంగా మారకుండా, తనను గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, డిసిసిబి డైరెక్టర్ పేరబత్తిని ప్రసాద్, సిపిఎం మండల కమిటీ సభ్యులు కిలారు సురేష్, గుగులోతు పంతు, మందడపు శ్రీనివాసరావు, పారుపల్లి పూర్ణచంద్రరావు, దొంతిబోయిన రమేష్, సాదినేని మల్లికార్జునరావు, గుడిపూడి వెంకటేశ్వర్లు, కొమ్మినేని నాగేశ్వరరావు, తాతా వెంకయ్య, తాత వీరయ్య, నల్లమల నాగేశ్వరరావు, కుక్కల కోటేశ్వరరావు, షేక్ నాగుల మీర, గంగుల పాపారావు, గంగసాని రాఘవరావు, ఆయా గ్రామాల సిపిఎం శాఖా కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పే కేసీఆర్‌ను తరిమేయాలి

- తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకోవాలి
- అభివృద్ధి పేరు చెప్పి పార్టీ మారిన కందాళ ఏం చేశాడు..?
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



తెలంగాణ రాష్ట్రం కోసం 1200 మంది విద్యార్థులు ఆత్మ బలిదానాలు చేసుకుంటే చలించిపోయి సోనియ గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది, తెచ్చింది తామే అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన తిరుమలాయపాలెం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి, హనుమంతరావు మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి అధికారం చేజిక్కుంచుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాష్ట్ర ప్రజలు ఓటు ద్వారా తరిమికొట్టాలని అన్నారు. "గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మీరు గెలిపించిన ఎమ్మెల్యే అభివృద్ధి పేరు చెప్పి పార్టీ మారాడు. మీ గ్రామంలో ఏం అభివృద్ధి చేశాడు.. అధికార పార్టీలో చేరి డబుల్ బెడ్ రూం ఇల్లు, దళిత బందు, కొత్త రేషన్ కార్డులు ఎన్ని ఇప్పించాడు' అని ప్రశ్నించారు. ఆయన వ్యక్తిగత స్వలాభం కోసం బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌కు తొత్తుగా మారాడని ఆరోపించారు. డబ్బు మదంతో, అధికార మదంతో విర్రవీగుతున్న ఆపద్ధర్మ ప్రభుత్వానికి, ఇందిరమ్మ రాజ్యానికి, ప్రజా పరిపాలనకు యుద్ధం జరుగుతుందని అన్నారు. ఈ యుద్ధంలో ప్రజలు బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కేసీఆర్ చెంప చెళ్లుమనే సమాధానం చెప్పాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ బోడ మంగీలాల్, రామసహాయం నరేశ్ రెడ్డి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, జాల కిరణ్, శ్యాం సుందర్ రెడ్డి, చామకూరి శ్రీనివాస్, దొడ్డ గురవయ్య, చామకూరి రమేష్, జాల నాగేశ్వరరావు, పదముత్తు సంజీవరావు, రావూరి యాకోబు రావు, మేకల సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ రావిండ్ల వెంకన్న, రావిండ్ల సుధాకర్, చల్లా వీరభద్రం, చామకూరి నరసయ్య, టెంకటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మీ శీనన్న అండగా ఉంటారు

కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం

నిరంకుశ బీఆర్ఎస్ ప్రభుత్వం పోటీ పరీక్ష పత్రాల లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని, మీ అందరికీ పొంగులేటి శీనన్న అండగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం చేస్తారని కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్లో రైట్ ఛాయిస్ అకాడమీ ఉద్యోగార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడవద్దని, మన కాంగ్రెస్ సర్కార్ వచ్చాక వరస నోటిఫికేషన్లు ఉంటాయని, తన మాటగా ఇక్కడ అభయం ఇవ్వమన్నారని తెలిపారు. చైతన్యవంతమైన మీరంతా.. భారీ మెజారిటీ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైట్ ఛాయిస్ నిర్వాహకులు మెండెం కిరణ్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ బయోడేటా దరఖాస్తులను ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. మెండం కిరణ్ కృషి అభినందనీయమని ప్రశంసించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. లీకేజీలు లేని పరీక్షల నిర్వహణ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆవశ్యకతను తమ ప్రాంతాల్లో వివరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైట్ ఛాయిస్ అకాడమీ నిర్వాహకులు మెండెం కిరణ్, జ్యోతిర్మయి, వందలాది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.



ప్రజల ఆదరణకు ధన్యుడిని

- ఎన్నికల ప్రచారంలో ప్రజల బ్రహ్మరథం
- 80 శాతం సర్వేలు తనకే అనుకూలం
- ప్రజలు నన్ను గెలిపించుకునేందుకు సిద్ధమయ్యారు
- మూడవసారి ముఖ్యమంత్రి కేసీఆర్
- గెలిచిన వెంటనే అభివృద్ధిని చాలెంజిగా తీసుకుంటా..
- నవతెలంగాణతో ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా



నవతెలంగాణ-పాల్వంచ

"ఎన్నికల ప్రచారంలో ప్రజలు నాకు బ్రహ్మరథం పడుతున్నారు. 80 శాతం సర్వేలు తనకే అనుకూలంగా ఉన్నాయి. ప్రజలు సైతం తనవైపే ఉన్నారు. గెలుపు ఖాయం. ఇది నా జన్మభూమి, కర్మభూమి అని తాను చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుంది. ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్ళిన మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలుకుతున్నారని వారి ఆదరణకు ధన్యుడినని ఎల్లకాలం రుణపడి ఉంటాను. నియోజకవర్గంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కు సైతం ఎంతగానో ప్రేమ ఉందని తను అడిగిన వెంటనే వేలాది కోట్ల నిధులను మంజూరు చేశారని ఆ నిధులతో అభివృద్ధి జరిగింది. నియోజకవర్గంలో ప్రజలు వనమా కావాలని కోరుకుంటున్నారని తనను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రజల ఆశీస్సులతో తిరిగి మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తున్నానని" బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ప్రచారానికి తొమ్మిది రోజులే సమయం ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గెలుపుపై ధీమాతో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు నవతెలంగాణతో ప్రత్యేక ఇంటర్వ్యూ.

నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు...?

జవాబు : 40 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ప్రజలకు ఎంతో చేశానని నా తుది శ్వాస వరకు చేస్తూనే ఉంటానని చెప్పారు. నియోజకవర్గ ప్రజల సమస్యలు తనకే తెలుసని తాను తొలిసారి ఎమ్మెల్యే అయిన నాటి నుంచి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వచ్చానని, ఈ నియోజకవర్గంలో ఓటుఅడిగే హక్కు ఏ పార్టీకి లేదని తను ఒక్కడికే ఆ హక్కు ఉందని ఈ గడ్డ నా అడ్డా. నియోజకవర్గంలో ఏ గల్లీలో చూసిన తాను వేసిన శిలాఫలకాలు, అభివృద్ధి కనిపిస్తుందన్నారు. వార్డు మెంబర్, సర్పంచ్, మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన కాలంలోనూ సైతం వృద్ధి లక్ష్యంగా పని చేశానన్నారు.

గెలుపుపై మీ ధీమా.?

1989లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లిన పొంగుతున్న వాగులు వంకలు, రోడ్లు, డ్రైన్లు, పక్క గృహాలు లేక, మంచినీటి సౌకర్యం లేక ప్రజలు ఎంతగానో ఇబ్బందులు గురయ్యేవారని అన్నారు. గ్రామాల చుట్టూ ఉన్న వాగులు పొంగితే రాకపోకలు లేక తిండి తిప్పలు లేక ప్రజలు నరకయాతన గురయ్యేవారని ఆ ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామానికి బ్రిడ్జిలను నిర్మించానన్నారు. గ్రామాలలో రోడ్లు వేయడంతో పాటు డ్రైనేజీలను నిర్మించి సుందరంగా తీర్చిదిద్దానన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు కిన్నెరసాని జలాలను పట్టణాలతోపాటు గ్రామాలకు తీసుకువచ్చానని, ప్రతి గ్రామంలో బోర్లను వేసి ఓవర్ హెడ్ ట్యాంకులను కట్టించి నీటి వసతిని కల్పించానన్నారు. ఇక్కడ నీటి ఎద్దడి అనే మాట వినపడకుండా చేశానన్నారు. పక్క ఇండ్లు కట్టించానని, గ్రామ గ్రామన విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అనేక సమస్యల పరిష్కరించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని రామవరం శివారు ప్రాంతంలో మాత శిశుఆసుపత్రిని కట్టించి ఉచిత వైద్యాన్ని అందిస్తున్న ఘనత తనతోపాటు బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. కోట్ల రూపాయలు చెల్లించి వైద్య విద్యను అభ్యసించే లేక అనేకమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యేవారని మరి సౌకర్యార్థం మెడికల్ కళాశాలను సైతం నిర్మింపజేసి తక్కువ ఖర్చుతో వైద్య విద్యను నేర్చుకునేందుకు కృషి చేశానన్నారు.

పేదలకు మీరిచ్చిన హామీలు, చేసిన పనులు..?

కొత్తగూడెం మున్సిపాలిటీతో పాటు పాల్వంచ మున్సిపాలిటీ, పాల్వంచ మండలం, కొత్తగూడెం మండలాల్లో అనేక మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇండ్ల పట్టాలను సైతం ఇప్పించడం జరిగిందన్నారు. రుద్రంపూర్ లోని భూ నిర్వాసితులకు సైతం పట్టాలు ఇప్పించిన ఘనత తనదేనన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూశాను అన్నారు. వేల కోట్ల నిధులను తీసుకువచ్చి పాల్వంచ కొత్తగూడెంలను హైదరాబాద్ సికింద్రాబాద్ లా తీర్చిదిద్దానన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన వెంటనే గోదావరి జలాలను తీసుకువచ్చి ప్రజల దాహార్తిని తీర్చేందుకు అనేక విధాలుగా కృషి చేస్తున్నానుఅని అన్నారు.

మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్

తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరగని ఉద్యమం చేసి సాధించిన కెసిఆర్ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా 10 సంవత్సరాలు దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతో మేలు చేశారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారన్నారు తిరుగులేని మెజార్టీతో కేసిఆర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాడని తెలిపారు.



హక్కులు కోసం కమ్యూనిస్టులు ఉండాలి

- పోరాటాల అర్జున్‌కి ఓటు వేయండి
- మాజీ ఎంపీ మీడియం

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడే వ్యక్తి పిట్టల అర్జున్ అని ఆయనని చట్ట సభలకు పంపితే పేదల పక్షాన అయన గొంతు వినిపిస్తారని మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు అన్నారు. అశ్వారావుపేట నియోజక వర్గ సీపీఐ (ఎం) అభ్యర్థి పిట్టల అర్జున్ పర్యటన సోమవారం మండలంలో సాగింది. భీమునిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మాజీ పార్లమెంట్ సభ్యులు మీడియం బాబురావు హాజరై మాట్లాడారు.

గిరిజన భూముల్లో హరితహారం అనే పేరుతో మొక్కలు నాటుతున్న ప్రభుత్వానికి ఎదురు నిలబడి పోరాడిన పార్టీ సీపీఐ(ఎం) అని అదేవిధంగా పేదల కోసం గతంలో పదవులు త్యాగం చేసి ఉపాధి చట్టం, సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల చట్టం సాధించిన ఘనత కూడా ఉందని, అలాంటి పార్టీని నమ్ముకొని రెండు దశాబ్దాలుగా పైగా సిద్ధాంతాల కోసం పని చేస్తున్న పిట్టల అర్జున్‌కి ఓటు వేసి చట్ట సభలకు పంపాలని అన్నారు. బూర్జువ పార్టీ నాయుకులు పదవులు కోసం ఎన్నో పార్టీకి మారుతూ రోజుకో పార్టీలో వుంటూ వ్యక్తిగత సంపాదన కోసం ఆరాట పడుతూ ఉంటారని కానీ సీపీఐ(ఎం)అభ్యర్థి అర్జున్ మాత్రం ప్రజల పక్షన ప్రజా సంఘాలు తరుపున పోరాడతారన్నారు. రాష్ట్రంలో ఆశావర్కర్ల, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు కోసం పోరాటాలు చేసిన వ్యక్తి పిట్టల అర్జున్ అని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం కోసం అరాట పడుతున్నాయని, బీజేపీ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తు కార్మికులు రైతులను అణగతొక్కుతుందన్నారు. ప్రశ్నించేందుకు పని చేసే విధంగా సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి పిట్టల అర్జున్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, జిల్లా నాయకులు నాగేశ్వరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, మండల కార్యదర్శి వెంకటరత్నం, రాంచరణ్, సత్యనారాయణ, బాబురావు, రాజమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు

నవతెలంగాణ-పినపాక

కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి అందాయని, అభివృద్ధిని చూసి ఓటేయాలని తెలంగాణ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం పినపాక మండల పరిధిలోని గోవిందాపురం, గోపాల్ రావు పేట, పినపాక, గడ్డంపల్లి, నారాయణపురం, బోటి గూడెం, బందగిరి నగరం, మడతన కుంట, సీతంపేట, ఉప్పాక, పెంటన్నగూడెం, బొమ్మరాసు పల్లి, ఏడుళ్ల బయ్యారం, ఎల్చిరెడ్డిపల్లి, పాత రెడ్డిపాలెం గ్రామాలలో పర్యటించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా దళిత బంధు పైలట్ ప్రాజెక్టుగా స్వీకరించి ప్రతి ఒక్క దళిత కుటుంబానికి దళిత బంధు అందజేస్తామని తెలియజేశారు. బీసీ వర్గాలకు సైతం బీసీ బందు ప్రవేశపెట్టిన ఘనత కేవలం బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పుట్టిన దగ్గర నుండి చివరి దశ వరకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కేసిఆర్ ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ కమిటీ చైర్మన్ భద్రయ్య, సహకార సంఘ చైర్మన్ రవి శేఖర్ వర్మ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బొలిశెట్టి నరసింహారావు, భవాని శంకర్, కొండేరు రాము, కొండేరు నాగభూషణం, రాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

మోడీ, కేసీఆర్ పాలనలో పెరిగిన నిరుద్యోగం

నియంత పాలనలకు పులిస్టాప్ పెట్టాలి

- సీపీఐ(ఎం) అభ్యర్థి దుగ్గి కృష్ణను గెలిపించండి
- రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సోమయ్య

నవతెలంగాణ-ఇల్లందు

గత ఎన్నికలలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని గద్దనెక్కిన మోడీ ప్రభుత్వం, యేటా జాబ్ క్యాలెండర్ తీస్తూ ఉద్యోగాలు కల్పిస్తామని కెసిఆర్ నిరుద్యోగులను దగా చేసి నియంత పాలన సాగిస్తున్నారని వారి పాలనలకు చిరమగీతం పాడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. సోమయ్య ఓటర్లను కోరారు. సిపిఎం అసెంబ్లీ అభ్యర్థి దుగ్గి కృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ లేబర్ అడ్డా వద్ద సోమవారం రోడ్ షో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ధరలు ఆకాశాన్ని అంటాయని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, కుల దురహంకార దాడులు, ప్రైవేటీకరణలు పెరిగాయన్నారు. ప్రశ్నించిన వారిపై దేశద్రోహం ముద్రలు వేస్తూ కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ ఇబ్బందుల గురించి చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ 9 ఏళ్ల పాలనలో పరకాల ప్రవేశపెట్టి ప్రజా మద్దతు పొందాలని చూస్తున్నారని అన్నారు. లక్షల కోట్ల అప్పులు చేసి, కనీసం ఉద్యోగులకు నెలనెలా సక్రమంగా జీతాలు ఇవ్వలేని దుస్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. గ్రామాల్లో, వీధుల్లో మద్యం ఏరులై పారిస్తూ వచ్చే ఆదాయంపై ప్రభుత్వాన్ని నెట్టుకు రావడం సిగ్గుచేటన్నారు. అధికార పక్షాన్ని నిలదీయడానికి దుగ్గి కృష్ణకు నియోజకవర్గ ప్రజలంతా ఓటు వేసి అసెంబ్లీకి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబీ, ఆదివాసీ, గిరిజన, సీఐటీయు సంఘాల రాష్ట్ర నాయకులు వజ్జ సురేష్, కూకట్ల శంకర్, పట్టణ నాయకులు మన్యం మోహన్ రావు, ఆలేటి కిరణ్ అబ్బాస్, సోమకృష్ణ సుజాత, బోస్, విజయ్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థి దుగ్గి కృష్ణను గెలిపించండి : రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్

నియోజకవర్గం సమస్యలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాలను సక్రమ దారిలో పెట్టడానికి ప్రత్యక్షం బలంగా ఉండాల్సిన



అవసరం ఉందని, సీపీఐ(ఎం) తరఫున పోటీ చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి కృష్ణను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్ ప్రజలను కోరారు. సోమవారం రోడ్ షో కార్నర్ మీటింగ్లో మాట్లాడారు. సిపిఎం బలపడితే ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు.

పార్టీలు మారే వారిని ఓడించండి : అసెంబ్లీ అభ్యర్థి దుగ్గి కృష్ణ

అభివృద్ధి కోసం అంటూ పార్టీలు మారే వారిని ఓడించాలని సిపిఎం పార్టీ అసెంబ్లీ అభ్యర్థి దుగ్గి కృష్ణ నియోజకవర్గ ఓటర్లను కోరారు. సుందరయ్య నగర్ లో జరిగిన రోడ్ షోలో మాట్లాడారు. ప్రజా ఉద్యమాలు చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని బ్యాలెట్ నెంబర్ 1 లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నవతెలంగాణ
8
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | నవంబర్ 21-2023 | www.navatelangana.com

పేట విజయంపై సీపీఐ(ఎం) ప్రభావం

- బరిలో 14 మంది
- రెండవ సారి పోటీ పడుతున్న ప్రధాన ప్రత్యర్థులు







నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట నియోజకవర్గం 2009న ఏర్పడిన దగ్గర నుంచి ఇప్పటి వరకు నాల్గవ దఫా ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతి సారీ పది మందికి తగ్గకుండా అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 2009లో 10, 2014లో 15, 2018లో 12, నేడు 2023లో 14 మంది బరిలో నిలిచారు. 2009 నుంచి నేటి వరకు అనగా నాల్గవ సారి గోండ్వానా గణతంత్ర పార్టీ అభ్యర్థి కన్నెబోయిన వెంకట నర్సయ్య పోటీ చేస్తూనే ఉన్నాడు. ఇతనికి 2009లో 843, 2014లో 692, 2018లో 481 ఓట్లు పోలైయ్యాయి. గత రెండు సార్లు పోటీలో నిలిచి, నేడు సైతం తలపడుతున్న ఆంగోతు క్రిష్ణ అనే స్వతంత్ర అభ్యర్థికి 2014లో 324, 2018లో 284 ఓట్లు పోలైయ్యాయి. ఈ ఎన్నికల్లో ఎన్ని వస్తాయి అనేది చూడాలి మరి.

ప్రస్తుతం 2014లో పోటీచేసి ప్రస్తుతం తల పడుతున్న అభ్యర్థులు ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు, ప్రత్యర్థులు బీఆర్ఎస్ నుండి మెచ్చా నాగేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా జారే ఆదినారాయణ ఉన్నారు. 2009లో 2వ, 2018లో మూడో స్థానంలో ఉన్న సీపీఐ(ఎం) నేడు 2023లో ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా సీఐటియు జిల్లా నాయకులు అర్జున్ రావు పిట్టలను బరిలోకి దించింది. దీంతో పేట విజయంపై సీపీఐ(ఎం) ప్రభావం తప్పకుండా ఉంటుంది అనేది రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

2014లో పోటీ చేసి ప్రస్తుతం పోటీ చేస్తున్న అభ్యర్థులలో మెచ్చా నాగేశ్వరరావుకు 2014లో తెదేపా అభ్యర్థిగా 48,616 ఓట్లు పడ్డాయి. 2018లో కాంగ్రెస్ బలపరిచిన తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా మెచ్చా నాగేశ్వరరావుకు 61,124 ఓట్లు రాగా, సిపిఐ(ఎం) అభ్యర్థి తానం రవీందర్‌కు 4,955 ఓట్లు వచ్చాయి. 2014లో బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబడ్డ నేడు కాంగ్రెస్ బీ ఫాం పోటీ చేస్తున్న జారే ఆదినారాయణకు 2014లో 13,217 ఓట్లు మాత్రమే వచ్చాయి. నేడు ఎన్ని ఓట్లు వస్తాయి అనేది వేచి చూద్దాం. ప్రస్తుతం టీఆర్ఎస్ అభ్యర్థిగా, ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన మెచ్చా నాగేశ్వరరావు 2014లో తెదేపా నుంచి పోటీ పడి 48,616 ఓట్లుతో నాడు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లుపై అపజయం పాలయ్యారు. 2018లో తనను ఓడించిన తాటి వెంకటేశ్వర్లుపై 61,124 ఓట్లుతో విజయం సాధించారు. మెచ్చా నాగేశ్వరరావు ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి పోటీపడుతున్నారు. ఇదిలా ఉండగా 2009లో 41, 076 ఓట్లతో రెండవ స్థానంలో, 2018లో మూడో స్థానంలో నిలిచిన సీపీఐ (ఎం) నేడు స్వతంత్రంగానే పోటీ చేస్తోంది. దీంతో సీపీఐ (ఎం) అశ్వారావుపేట విజయావకాశాలు పై ప్రభావం చూపనుంది. 2009లో కాంగ్రెస్, సీపీఐ(ఎం), ప్రజా రాజ్యం పార్టీలు ప్రధాన పార్టీలుగా పోటీ పడి ఒకటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 2014లో వైఎస్ఆర్‌సీపీ, తెదేపా, కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రధాన పార్టీలుగా పోటీ పడి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లు, తెదేపా అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, టీఆర్ఎస్ అభ్యర్థి జారే ఆదినారాయణలు ఒకటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు.ఈ ఎన్నికల్లో ప్రజా రాజ్యం పార్టీ ఉనికి కోల్పోయింది. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా మెచ్చా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ అభ్యర్థి గా తాటి వెంకటేశ్వర్లు,సిపిఐ(ఎం) అభ్యర్థిగా తానం రవీందర్,భాజపా అభ్యర్థిగా భూక్యా ప్రసాద్ లు ఒకటి,రెండు,మూడు,నాలుగు స్థానాల్లో నిలిచారు.ఈ ఎన్నికల్లో వైఎస్ ఆర్ సీపీ కనుమరుగు అవడం విశేషం. ప్రస్తుతం బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ(ఎం) పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యేగా మెచ్చా నాగేశ్వరరావు,టీఆర్ఎస్ లో ఉండి పార్టీ పరంగా,తాను వ్యక్తిగతంగా తన సామాజిక వర్గం లో అనేక ప్రజాప్రయోజన సేవా కార్యక్రమాలు నిర్వహించి వ్యక్తిగా జారే ఆదినారాయణ,ఈ నియోజక వర్గంలో పోడు భూములకు పట్టాలు రాబట్టడానికి అనేక పోరాటాలు,ఉద్యమాలు నిర్వహించిన పార్టీగా గిరిజన, గిరిజనేతరుల లో ఎంతో ఆదరణ పొందిన సిపిఐ(ఎం) అభ్యర్థిగా బరిలో ఉన్న, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన కార్మికుల, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు, సమ్మెలకు నేతృత్వం వహించిన నాయకుడిగా అర్జున్ రావు పిట్టల నడుమ త్రిముఖ పోటీ ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

1500 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-మణుగూరు



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మణుగూరు మండల అధ్యక్షులు, నియోజకవర్గం ఎన్నికల కో-ఆర్డినేటర్ గురజాల గోపి ఆధ్వర్యంలో పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు సమక్షంలో సుమారు 1500 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రేగా కాంతారావు సమక్షంలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు గోపి, ఇల్లందు కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేటర్ అశ్వాపురం ఎంపీటీసీ పోరెడ్డి విజయలక్ష్మి, మణుగూరు ఎస్టీ సెల్ అధ్యక్షులు కిషన్ నాయక్, కొండబాబు లక్ష్మయ్య, కొరివి రవి శేఖర్, కృష్ణ వంశీతో పాటు సుమారు 1500 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రేగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

గూడెం అభివృద్ధి చెందాలంటే వనమాని గెలిపించాలి

- వనమా గెలుపు కోరుతూ కుటుంబ సభ్యుల ప్రచారం

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం నియోజక వర్గం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు కోరుతూ ఆయన కుటుంబ సభ్యులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం కొత్తగూడెం ప్రకాశం మైదానంలో ఉదయం వేళ మార్నింగ్ వాకర్స్‌ని వనమా మనవరాళ్లు డాక్టర్ వనమా అలేఖ్య, హర్షిని మనీషాలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. తాతా వనమా గెలుపుకు ఓటర్లను కలిసి ఓటు వేయాలని కోరుతున్నారు. కొత్తగూడెం మరింత అభివృద్ధి చెందాలంటే వనమా గెలుపొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది లక్కినేని సత్యనారాయణ, బీఆర్ఎస్ నాయకులు మాట్ల గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు పిట్టల అర్జున్ పర్యటన

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల పరిధిలో అశ్వారావుపేట నియోజకవర్గం సీపీఐ(ఎం0 అసెంబ్లీ అభ్యర్థి పిట్టల అర్జున్ రావు మంగళవారం సీతయ్య గూడెం, అయిన పాలెం, దామరచర్ల, చంద్రుగొండ, రేపల్లెవాడ, గుర్రాయి గూడెం, తుంగారం, రవికంపాడు, బాలి కుంట, పోకల గూడెం, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటిస్తారనిపార్టీ మండల కార్యదర్శి ఐలూరు రామిరెడ్డి తెలిపారు.



అభివృద్ధి పథకాల రూపకల్పనంలో కేసీఆర్ మేటి

- ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-చంద్రుగొండ

అభివృద్ధి పథకాల రూపకల్పనలో సీఎం కేసీఆర్‌కు ఎవరు సాటి రారని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సీతయ్య గూడెం, మహ్మద్ నగర్, తిప్పనపల్లి, రేపల్లెవాడ, గానుగపాడు, తుంగారం, చంద్రుగొండ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మెచ్చాకు ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కొన్ని కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీఎంకు ఈ నియోజకవర్గం పై ప్రత్యేకమైన దృష్టి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా గెలవలేక కలగూరగంపగా ఏర్పడి బీఆర్ఎస్ ఓడించేందుకు సతవిధాల ప్రయత్నిస్తుందన్నారు. ప్రజలంతా గ్రహిస్తున్నారని ఎన్నికలలో గుణపాఠం నేర్పుతారని మెచ్చా అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు ధారా బాబు, ప్రధాన కార్యదర్శి సంఘోండి రాఘవులు, వైసీపీ నరుకుల సత్యనారాయణ, మండల రైతు సమితి సభ్యులు వాసు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రసూల్, మండల నాయకులు భూపతి రమేష్, మండల ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు కేలోత్ శీను, ఎంపీటీసీలు లంక విజయలక్ష్మి, రాజి, సర్పంచులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వారంటీ లేని గ్యారెంటీ కార్డును నమ్మొద్దు

- సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం
- ఎన్నికల ప్రచారంలో హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు



కాంగ్రెస్ పార్టీ చెప్పే వారంటీ లేని గ్యారెంటీ కార్డును ప్రజలు నమ్మవద్దని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి హరిప్రియ అన్నారు. మండలంలోని సుదిమల్ల, పూబెల్లి, మొండితోగు, విజయలక్ష్మి, తిలక్ నగర్, చల్ల సముద్రం, రేపల్లె వాడ గ్రామపంచాయతీలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా ఆహ్వానం పలికారు. పార్టీ శ్రేణులు, మహిళలు, ప్రజలు, హరిప్రియ నాయక్ డప్పు చప్పుళ్ల, కోలాటాలు, బతుకమ్మలు, మంగళ హరతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అపారమని రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్‌కు లేదనీ అన్నారు. గతంలో ఎన్నో ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ హయాంలో మంచినీరు, కరెంటు, మౌలిక సదుపాయాలు ఎందుకు కల్పించలేకపోయిందో ఒకసారి ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఆచరణకు సాధ్యం కానీ హామీల పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్న కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రాకుండా ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని తెలిపారు. బాధ్యతాయుతమైన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోతోనే ప్రజలకు భరోసా అన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా ఆదరిస్తే ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో ఇల్లందు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని హామీ ఇచ్చారు.

ఎన్నికల ప్రచారంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, జడ్పీటీసీ ఉమాదేవి, మండల వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం రమేష్, ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, మండల కో ఆప్షన్ ఘాజి, ఉపాధ్యక్షులు బానోత్ రమేష్, సొసైటీ డైరెక్టర్ లస్కర్, రైతు కోఆర్డినేటర్ పూణే కమల, బానోతు హనుమ, కాంతారావు, పార్టీ మండల కమిటీ, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే మెచ్చా పర్యటన

నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు నేడు ఉదయం 9గంటల నుండి మండలంలోని మొండివర్రే, అచ్చుతపురం కాలనీలో పర్యటించనున్నట్టు మండల అధ్యక్షులు దొడ్డాకుల రాజేశ్వరరావు, మండల ప్రధానకార్యదర్శి దొడ్డా రమేష్ తెలిపారు. కావునా పార్టీ శ్రేణులందరూ పాల్గొనాలని వారు కోరారు.

అధికార పార్టీ అహంకారానికి వ్యతిరేకంగా గళమెత్తిన "కలం"

ఎమ్మెల్సీ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం బహిష్కరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల నియోజకవర్గ ఇన్చార్జిగా వచ్చినటువంటి ఎమ్మెల్సీ తాతా మధు అహంకార పూరిత పోకడలకు నిరసనగా భద్రాచలం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు ఒక తాటిపైకి వచ్చి తాతా మధుకి వ్యతిరేకంగా నిరసనగలం విప్పారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుండి భద్రాచలం మీడియాపై తాతా మధు వ్యవహరిస్తున్న తీరుని నిరసిస్తూ నేటి నుండి అధికార బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని బహిష్కరిస్తున్నట్టు జర్నలిస్టుల జేఏసీ నిర్ణయం తీసుకుంది. భద్రాచలం విలేకరుల పట్ల తాత మధు అనేక సందర్భాలలో చునకన చేసి అవహేళనగా మాట్లాడడమే కాక కేటీఆర్ పర్యటన సైతం ఖమ్మం నుండి పాత్రికేయులను పిలిచి రాచ మర్యాదలు చేసి భద్రాచలం విలేకరులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అహంకార వైఖరితో వ్యవహరించడంతో భద్రాచలం పట్టణంలోని విలేకరులందరూ తాతా మధుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ఉన్న ప్రెస్ క్లబ్బులందరూ ఒకటై జేఏసీకి ఏర్పడి నేటి నుండి అధికార బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని బహిష్కరించడమే కాక ఆ పార్టీ సోషల్ మీడియా ద్వారా నిర్వహిస్తున్న గ్రూపుల నుండి కూడా పాత్రికేయులు బయటికి వచ్చేయాలని తీర్మానం చేశారు. విలేకరులు తీసుకున్న నిర్ణయంతో మరింత నష్టం కలిగే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

దొర్ల పాలనకు విముక్తి చెబుదాం

నవతెలంగాణ-చంద్రుగొండ



నిరంకుశ అవినీతిమయ దొరల పాలనకు విముక్తి చెప్పాలని అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మద్దుకూరు, దామరచర్ల, అయ్యన్నపాలెం, సీతయ్య గూడెం, తిప్పనపల్లి, రేపల్లెవాడ, తుంగారం, గానుగపాడు, రైకంపాడు, చంద్రుగొండ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జారే మాట్లాడుతూ స్వలాభం కోసం పార్టీ మారిన మెచ్చాకు బుద్ధి చెప్పాలన్నారు. 10 రోజులు కష్టపడితే సంవత్సరాలు అధికారం మనదేనని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో ప్రజలకు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉన్న ఆరు గ్యారెంటీలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, తెలుగుదేశం, వైఎస్ఆర్ సీపీ పార్టీల సహకారంతో బీఆర్ఎస్‌ను ఓడించటం తధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు సురేష్, శేఖర్, భోజ నాయక్, రవణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దారం గోవింద్ రెడ్డి, ఎంపీపీ బానోత్ పార్వతి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

9
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | నవంబర్ 21-2023 | www.navatelangana.com

దుర్మార్గపు పాలనను సాగనంపుదాం

- కొత్తగూడెంను సన్ స్ట్రోక్ నుండి కాపాడుకుందాం
- ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని



నవతెలంగాణ-కొత్తగూడెం

ఒక్క సారి అవకాశం ఇవ్వండి, ఇదే నాకు ఆఖరి అవకాశం, మరోసారి ఎన్నికల్లో నిలబడనూ అంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి నమ్మించి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఆసన్నమైందని, కొత్తగూడెం నియోజకవర్గాన్ని సన్ స్ట్రోక్ నుండి కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం), టీజేఎస్, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీలు బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని ఎన్నికల ప్రచారం సోమవారం చుంచుపల్లి మండల పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, మేషన్ నగర్ కాలనీ, టూ, త్రీ, ఫోర్ ఇన్‌క్లయిన్, నాగయ్య గడ్డ, చిట్టి రామవరం 14 నెంబర్, రామవరం పలు ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అని, ఒప్పంద రాజకీయాలకు తెరలేపి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. మిత్రపక్షాలు బలపరిచిన కొత్తగూడెం నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూనంనేని కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునిగడప పద్మ, బానోత్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడుతా : కూనంనేని

పట్టణంలోని శేషగిరి భవన్ నందు దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం నియోజకవర్గం దళిత వర్గాలు కాంగ్రెస్, సిపిఎం, టిడిపి, టీజేఎస్, ప్రజాపంతా పార్టీలు బలపరుస్తున్న సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. కొత్తగూడెంలోని దళిత సంఘాలు పోటీలో ఉన్న నాకు మద్దతు ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, దళిత సంఘాల ప్రతినిధి పూసపాటి శ్రీనివాస్, దళిత నాయకులు బందెల నరసయ్య, అంతోటి నాగేశ్వరరావు, మంద హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి చేసిన హరిప్రియను గెలిపించాలి

- చైర్మెన్ దిండిగాల, టీబీజీకే నేత రంగనాథ్

నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన హరిప్రియను గెలిపించాలని గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు దండిగాల రాజేందర్, టీబీజీకేస్ డివిజన్ ఉపాధ్యక్షులు ఎస్.రంగనాథ్ వ్యాపారస్తులను కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం రామ్ బంజారాలోని వ్యాపారస్తులను కలుసుకొని ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ లాల్ సింగ్, యువజన, సోషల్ మీడియా నాయకులు ఎంటెక్ మహేందర్ పాల్గొన్నారు.



కార్మికుల పక్షాన నిలబడే సీపీఐ(ఎం)ను గెలిపించండి

- కారం పుల్లయ్యను అసెంబ్లీకి పంపించండి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కార్మికుల హక్కులను కాపాడేందుకు అనేక రకాల పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం)కు కార్మికులు మద్దతుగా నిలిచి రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఎర్రజెండా పార్టీలను గెలిపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్ పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద నిర్వహించిన విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశానికి ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని కార్మిక చట్టాల స్థానంలో కోడ్‌లను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో గొంతు విప్పే కారం పుల్లయ్యను గెలిపిస్తే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. అధికార పార్టీ నాయకులు ఇసుకను వ్యాపారంగా మార్చి భవన నిర్మాణ కార్మికులకు భద్రాచలంలో పనులు దొరకకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు జి.లక్ష్మీకాంత్, సంతోష్, చంటి, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, అమరావపురం శ్రీనుతో పాటు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ తోనే పేదల సంక్షేమం సాధ్యం : పాయం



నవతెలంగాణ-గుండాల

కాంగ్రెస్ పార్టీతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు పాయం సోమవారం గుండాల మండలంలో వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను వివరించారు. తన హయాంలో ఎలాంటి అవినీతి జరగ నివ్వలేదని నిత్యం ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తా అని తెలియజేశారు. అలాగే తనను బలపరిచిన ఇతర మిత్ర పార్టీలకు ధన్యవాదాలు తెలియజేసారు. ఇంతగా ఆదరిస్తున్న గుండాల మండల ప్రజలకు గెలిచాక ఋణం తీర్చుకుంటానని పాయం చెప్పారు. జిల్లా నాయకులు బట్ట విజయ్ గాంధీ మాట్లాడుతూ.. తన పూర్తి మద్దతును పాయంకు ఇస్తున్నానని, తెలంగాణా ఇచ్చిన సోనియమ్మకు ఋణం ప్రజలు తీర్చుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షు లు కొడెం ముత్యమాచారి, సీనియర్ నాయకులు పొంబోయిన ముతయ్య, మండల కార్యదర్శి ఈసం పాపారావు, పీఎస్ఆర్, పీవీఆర్ యువసేన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్కే ఖధీర్, టీజేఎస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్లపలి రమేష్, టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు తోలెం సాంబయ్య, ఉపాధ్యక్షులు ఇల్లందుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మరక మంచిదే...కవితా సంకలనం ఆవిష్కరణ

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎన్నికల నేపథ్యంలో ఓటు చైతన్యం పై ప్రభాకరాచార్యులు సంపాదకత్వంలో విద్యార్థులు రాసిన కవిత్వం మరక మంచిదే పుస్తకాన్ని తహశీల్దార్ కార్యాలయంలో నియోజక వర్గం ఎన్నికల సాదారణ పరిశీలకులు గణేష్, రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఓటర్లను చైతన్య పర్చడం కోసం విద్యార్థుల చే కవిత్వం రాయించడం, పుస్తక రూపంలోకి తీసుకురావడం ఎంతో అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, తహశీల్దార్ కృష్ణప్రసాద్, పుస్తక సంపాదకులు, కవి, రచయిత డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు. ఈ సంకలనంలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు తమ ఆలోచనలను కవిత్వంగా అక్షరీకరించారు.

బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని పార్కలగండి నుంచి కాకా శివ శంకర్ ప్రసాద్, కొండ్రు భారత్, కొండ్రు ఆనంద్, కీసరి మహేష్, తాటి సాయి, తాటి పవన్, కారం రవి, తాటి రాజు అలాగే నాచారం గ్రామం నుంచి సుమారు 20 కుటుంబాలు సోమవారం అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మెచ్చా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సోయం వీరభద్రం, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, మడసు శ్రీను, నాగేశ్వరరావు, రత్నాజి, తదితరులు ఉన్నారు.

టేకు చెక్కలు పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

చర్ల నుండి భద్రాచలం వైపు టీఎస్ 04 యుబి 2437 అనే నెంబర్ గల అప్పి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న టేకు చెక్కలను అటవీశాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఆటోలో టేకు చెక్కలను తరలిస్తున్నారనే సమాచారంతో డిఆర్ఓ శోభనాయక్ అటవీ సిబ్బందితో కలిసి చిన్న బండి రేవు వద్ద ఆటోని ఆపి తనిఖీ చేయగా 8 టేకు చెక్కలు పట్టుబడ్డాయి. వెంటనే పట్టుబడ్డ ఆటోతో పాటు టేకు చెక్కలను డివిజన్ ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. పట్టుపడ్డ టేకు చెక్కల విలువ సుమారు రూ.13 వేలు ఉంటుందని డిఆర్ఓ శోభనాయక్ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్‌బిఓ రవీందర్, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

కూనంనేని గెలుపు కోసం కృషి చేయాలి

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. సోమవారం పాల్వంచ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. కార్యకర్తలు కాంగ్రెస్ మేనిఫెస్టో 6 గారంటీలను గడపగడపకు ప్రచారం నిర్వహించాలన్నారు.

కొత్వాలకు సన్మానం : మొదటిసారి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన కొత్వాలకు కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కొత్వాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు నాగ సీతారాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల రంగారావు, సీనియర్ నాయకులు జాలే జానకిరెడ్డి, ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల అధ్యక్షులు కోండం వెంకన్న, బద్ది కిశోరె, సర్పంచ్ గద్దల రమేష్, కందుకూరి రాము తదితరులు పాల్గొన్నారు.

పీఎసీఎస్ మాజీ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరిక



నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ పరిమి శ్రీనివాస్ రావు సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతోపాటు సుమారు 30 కుటుంబాలు పార్టీలో చేరారు. వారికి బ్రహ్మయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కోర్స ఆనంద్, సింగిరెడ్డిపల్లి బూత్ ఇంచార్జ్ గుదిబండ మధుసూదన్ రెడ్డి, కోర్స రామారావు, గుమ్మల సత్యం,పండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

- 150 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరిక



నవతెలంగాణ-ఇల్లందు

అసెంబ్లీ ఎన్నికలు దగ్గర వడంతండడంతో పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి మరోసారి భారీ షాక్ తగిలింది. మండల పరిధిలోని బుజ్జయిగూడెం గ్రామపంచాయతీలోని ఎస్ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో పీఏసీఎస్ చైర్మెన్ మెట్టల కృష్ణ, సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ చీమల సరోజ, ఉప సర్పంచ్, వార్డు నెంబర్స్ తోపాటు 150 కుటుంబాలు ఉన్నాయి. ఎమ్మెల్యే హరిప్రియ హరి సింగ్ నాయక్ విధానాలు నచ్చక కార్యకర్తల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అనంతరం వారికి మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, జిల్లా నాయకులు జానీ, మండల అధ్యక్షులు పులి సైదులు తదితరులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ముఖ్య నాయకుల రాక

నవతెలంగాణ-చర్ల

భద్రాచలం నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి పొదెం వీరయ్య గెలుపును కాంక్షిస్తూ నేడు కాంగ్రెస్ ముఖ్య నాయకులు చర్ల రానున్నారు. ఈ మేరకు టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఉదయం 10 గంటలకు సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి వర్యులు, తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీని వాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ చర్ల బస్టాండ్ సెంటర్లో జరిగే కార్నర్ మీటింగ్‌కు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, పుల్లారావు యువజన కాంగ్రెస్ నాయకులు సుందరి సురేష్, తోటమల్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



నవంబర్ 30న జరిగే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న కూనంనేని సాంబశివరావు, భద్రాచలం నియోజకవర్గం నుండి కారం పుల్లయ్య, ఇల్లందు నియోజకవర్గం నుండి దుగ్గి కృష్ణ, అశ్వారావుపేట నియోజకవర్గం నుండి పిట్టల అర్జున్‌లకు నా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆర్థిక, సామాజిక అసమానతలు భారీగా పెరిగిపోతున్న క్రమంలో, అసమానతలు తొలగించుటకు కృషిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులుగా ఈ నలుగురు పోటీలో ఉన్నారు. నేను ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ఇండిపెండెంటు అభ్యర్థిగా పోటీ చేసి, ఎమ్మెల్సీగా ఎన్నికైన నాటి నుండి ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగిపోవాలని, ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందాలని కృషి చేస్తున్నానని తెలిపారు. సాంబశివరావు, పుల్లయ్య, కృష్ణ, అర్జున్లు కూడా అదే లక్ష్యంతో పనిచేస్తున్నారని తెలిపారు. అందువల్లనే వీరికి నా సంపూర్ణ మద్దతు తెల్పుతూ, కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు తమ ఓటును వేసి ఈ నలుగురు అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం ద్వారా అంబానీ, అదానీ లాంటి కొద్ది మంది పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూరుస్తూ, వారివి లక్షల కోట్లకు అధిపతులను చేస్తుంది. ఈ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో వంద లక్షల కోట్లు అప్పు చేసి, దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని తెలిపారు. ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించటంలో ప్రధాన పాత్ర పోషించేది 'విద్య'. నూతన విద్యా విధానము-2020 ద్వారా కేటి నుండి పీజీ వరకు ప్రభుత్వ రంగములో మిగిలియున్న విద్యను కూడా ప్రైవేటుపరం చేయడానికి కృషి చేస్తున్నదని, అందు కోసం కేంద్ర బడ్జెట్లో విద్యకు కోఠారీ కమిషన్ సూచించిన 10 శాతం కాకుండా, క్రమంగా తగ్గిస్తూ 2023-24 బడ్జెట్లో 2.67 శాతానికి తీసుకువచ్చిందని తెలిపారు. ప్రభుత్వరంగ విద్యలో ప్రధానమైన ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలల్ని వదిలేసి, కొత్తగా 650 గురుకుల పాఠశాలల్ని ఏర్పాటు చేసి, గతంలో ఉన్న వాటితో కలుపుకొని 1000 గురుకులాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఊదరగొడ్తున్నారు. ఈ గురుకులాలలో మొత్తం అడ్మిషన్లు నాలుగు లక్షల ఎనభై వేలు. వాస్తవంగా చేరిన వారు నాలుగు లక్షల యాభై వేలే, అరవై లక్షల మంది విద్యార్థులున్న తెలంగాణలో నాలుగు లక్షల యాభై వేల మందికి ' విద్య' నందిస్తే సరిపోతుందా...? మిగిలిన యాభై ఐదు లక్షల విద్యార్థుల సంగతేమిటి...? ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలల్ని అభివృద్ధి చేయుట ద్వారానే బాల, బాలికలందరికీ ఉచిత, నాణ్యమైన విద్యను అందించవచ్చుఅని తెలిపారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళలో 80 శాతం పైగా విద్యార్థులు ప్రభుత్వ బడులలో చదువుతుంటే, తెలంగాణలో 45 శాతం విద్యార్థులే ప్రభుత్వ బడులలో చదువుచున్నారని, ఏ లెక్క తీసినా తెలంగాణ దిగదుడుపే అని తెలిపారు. అందువల్లనే భిన్నమైన విధానాలతో ఆర్థిక, సామాజిక అంతరాలను తొలగించుటకు కృషి చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులుగా పోటీలో ఉండి, ఇప్పటికే అట్టి కృషి చేస్తున్న కూనంనేని సాంబశివరావు, కారం పుల్లయ్య, దుగ్గి కృష్ణ, పిట్టల అర్జున్‌లకు మీ విలువైన ఓటు వేసి గెలిపించాలని కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలను కోరుతున్నానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

వనమా గెలుపు తథ్యం

- రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ

నవతెలంగాణ-పాల్వంచ



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపు తథ్యమని రాష్ట్ర నాయకులు ఎడవల్లి కృష్ణ అన్నారు. సోమవారం కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచ మండలం కోడిపుంజుల వాగు, పునుకుల, పుల్లయిా గూడెం, యస్సీ కాలనీలలో వనమా, ఎడవల్లి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ వనమా గెలుపును ఏ దుష్ట శక్తులు అపలేవని, ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా వనమా గెలుపును అడ్డుకోలేరన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడు, స్థానికుడు ఎవరికి ఏ ఆపద వచ్చినా అదుకునే వ్యక్తి వనమా మాత్రమే అన్నారు. అందరూ కారు గుర్తు పై అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీ వనమాను గెలిపించాలన్నారు. యస్సీ కాలనీలో సూరిబాబు బీఆర్ఎస్ పార్టీలో ఎడవల్లి సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో బరపటి వాసు, వనమా రామకృష్ణ, ఎడవల్లి నవీన్ బాబు, భూక్యా చెందు నాయక్, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు.



కేటీఆర్ సభ సక్సెస్...

- హాజరైన ప్రజలకు కృతజ్ఞతలు
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- విలేకర్ల సమావేశంలో మోరే భాస్కర్

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్‌లో ఆదివారం జరిగిన మంత్రి కేటీఆర్ రోడ్ షో విజయవంతమైందని, భారత రాష్ట్ర సమితి మాజీ కార్యవర్గ సభ్యులు మోరే భాస్కరరావు తెలిపారు. సోమవారం జిల్లా భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ రోడ్ షోకి పెద్ద ఎత్తున ప్రజల తరలివచ్చారని, కేటీఆర్ ప్రసంగం ఎంతగానో ప్రజలను ఆకట్టుకుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి గడపగడపకు చేరే విధంగా చర్యలు తీసుకుందని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలనను మెచ్చి వివిధ పార్టీల నుండి గులాబీ పార్టీలోకి చేరడం జరుగుతున్న విషయాన్ని తెలిపారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు తొగరు రాజశేఖర్, రాజు గౌడ్, ఉషారాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించండి

నవతెలంగాణ-మణుగూరు

పినపాక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వరరావు హస్తంపై ఓటు వేసి గెలిపించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్, సివిల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్(ఐ) పార్టీ హామీ ఇచ్చిన ఆరు పథకాలను అమలు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుంచుతారని వివరించారు.

పాత్రికేయులను అవమానించడం దుర్మార్గమైన చర్య

- ఎమ్మెల్సీ వైఖరినీ ప్రతి ఒక్కరూ ఖండించాలి
- సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు చేరవేర్చడంతో పాటు ప్రజలకి ప్రభుత్వాలకి మధ్యలో వారధిగా పనిచేస్తున్నటువంటి పాత్రికేయులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ తాత మధు అవమానించడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్సీ వైఖరిని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తుందని, ఎమ్మెల్యే అభ్యర్థి కారం పుల్లయ్య సోమవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. పాత్రికేయులపై ఎమ్మెల్సీ చూపిస్తున్న వైఖరి ఆ పార్టీ అహంకారపూరిత విధానాలకు ప్రత్యక్ష నిదర్శనమని తెలిపారు. తాత మధు వైఖరికి నిరసనగా పాత్రికేయులు చేస్తున్న పోరాటానికి సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని తెలియజేశారు. ఎమ్మెల్సీ తాత ముదుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు పాత్రికేయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పత్రికా ప్రకటన విడుదల చేసిన వారిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మలపాటి రేణుక, సున్నం గంగా, బి.రమేష్, తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



ఎన్నికల్లో విధులు నిర్వహించి సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారులతో కేటాయించిన విధులపై సమీక్ష నిర్వహించారు. మార్కెటింగ్ అధికారి నోడల్ అధికారిగా నియమించినట్లు చెప్పారు. మన జిల్లా నుంచి ఇతర జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి 2586 మంది అలాగే ఇతర జిల్లాలను నుండి మన జిల్లాలో ఓటు హక్కు వినియోగానికి 4985 మంది ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. మన జిల్లా నుండి 36 నియోజకవర్గాలకు పోస్టల్ బ్యాలెట్స్ పంపాల్సిన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు చెప్పారు. సూక్ష్మ పరిశీలకులకు ఎల్‌జిఎం నివేదికలకు డీఆర్ఓ హెూమ్ ఓటింగ్ పర్యవేక్షణకు జడ్పీ సీఈఓలను ఇన్చార్జిలుగా నియమించినట్లు చెప్పారు. సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వాహనకు షెడ్యూల్ తయారు చేయాలని ఎల్జిఎంకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు, మంచినీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు, వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు పరిశీలన నివేదికలు చేయాలని జెడ్పి సీఈఓకు సూచించారు. ఓటు హక్కు వినియోగానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు దివ్యాంగులకు, వృద్ధులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని నోడల అధికారి లేనీనాకు సూచించారు. 512 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వాణకు అంతర్జాల సేవలు విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినా 20028 పోలింగ్ కేంద్రాల్లో లోపల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల కలెక్టర్ మధుసూదన్ రాజు, డీసీఓ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ రవీంద్రనాథ్, జెడ్పి సీఈవో విద్యారత, ఇంటర్మీడియట్ అధికారి సులోచన రాణి, మార్కెటింగ్ అధికారి హలీం, పౌరసరఫరాల డిఎం త్రినాథ్, డిఎస్ఓ రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.



కష్టజీవుల పక్షాన నిలిచే కమ్యూనిస్టులను ఆదరించండి

సీపీఐ(ఎం) నాయకులు లిక్కి బాలరాజు

నవతెలంగాణ-అశ్వారావుపేట

చేతి వృత్తి దారులు, అసంఘటిత కష్టజీవులు పక్షాన నికరంగా పనిచేసే కమ్యూనిస్టు అభ్యర్థులను గెలిపించడం ద్వారా వారి సమస్యలు పై చట్టబద్ధంగా అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా 19 స్థానాల్లో ప్రస్తుతం సీపీఐ(ఎం) అభ్యర్థులు పోటీ చేస్తున్నారని కావున వీరిని ఆదరించి ఓటు వేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజక వర్గం కార్మిక సంఘాలు బలపరిచిన సీపీఐ(ఎం) అభ్యర్థి అర్జున్ రావు పిట్టల విజయాన్ని కాంక్షిస్తూ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి బి.చిరంజీవి నేతృత్వంలో సోమవారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలోని పలు కాలనీల్లో, మండలంలోని దబ్బ తోగు, వడ్డిరంగాపురం పురం, కోయ రంగాపురం, గుమ్మడవల్లి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీరన్న, మండల కమిటీ సభ్యులు ముళ్ళ గిరి గంగరాజు, సోడెం ప్రసాద్, తగరం జగన్నాథంలు పాల్గొన్నారు.



అభ్యుదయ అభివృద్ధికి సీపీఐ(ఎం)ను గెలిపించండి

నవతెలంగాణ-దమ్మపేట

సీపీప(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కొక్కెర పార్టీ పుల్లయ్య సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి పిట్టల అర్జున్ రావుని గెలిపించాలని సోమవారం మండలంలోని మొండి వర్రే గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటే పేదల పక్షాన ప్రజా గొంతుకై పోరాటాలు పాలకవర్గంపై కొనసాగిస్తారన్నారు. ప్రజలు సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను చట్టసభలకు పంపాలన్నారు. పిట్టల అర్జునుని సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ లక్ష్మీనారాయణ, మోరంపూడి కేశవరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఫిర్యాదులపై చర్యలు తీసుకునేందుకు అందుబాటులో ఉంటాం'

నవతెలంగాణ-ఖమ్మం

అసెంబ్లీ సాధారణ ఎన్నికల దృష్ట్యా ఖమ్మం జిల్లాలోని (ఖమ్మం, పాలేరు) నియోజకవర్గాలకు సంబందించిన ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లైతే తమకు తెలియజేయాలని, పాత పోలీస్ కమిషనర్ క్యాంపు ఆఫీస్ జూబ్లీపూరా అందుబాటులో ఉంటామని అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బ్రిజేష్ కుమార్ రాయ్, అదేవిధంగా (మధిర,వైరా, సత్తుపల్లి) నియోజకవర్గాలకు సంబందించిన ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లైతే ఐపిఎస్ అధికారి సాధారణ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హెచ్.మంజునాధ్ స్వయంగా స్వీకరించడానికి ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలీస్ గెస్ట్ హౌజ్‌లో అందుబాటులో ఉంటామని తెలిపారు. అయా నియోజకవర్గాలకు సంబంధించి తమకు వచ్చే ఫిర్యాదులపై స్పందించి చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేయదలచిన వారు స్వయంగా గాని లేదా ఫోన్ ద్వారా గాని ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు సంబందించిన ఫిర్యాదులు పోలీస్ అబ్జర్వర్ బ్రిజేష్ కుమార్ రాయ్ ఫోన్ నెంబర్ 8919085511 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని, అలాగే మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు సంబందించిన ఫిర్యాదులు ఏమైనా ఉన్నట్లైతే పోలీస్ అబ్జర్వర్ హెచ్.మంజునాధ్ ఫోన్ నెంబరు 6304447259 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు వజ్రాయుధం

సత్తుపల్లిలో ఓటరు అవగాహన ప్రదర్శన

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కు అనేది వజ్రాయుధమని, దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వినియోగించుకోవాలని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమార్ అన్నారు. ఓటర్లను చైతన్య పర్చడానికి, కొత్త ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను జేవీఆర్ కళాశాల నుంచి బస్టాండ్ సెంటరు వరకు నిర్వహించారు. కళాశాల ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. ఓటుహక్కు శక్తిని చాటేలా ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు పానె రామచంద్రరావు, రాంబాబు, వినోద్‌కుమార్, బంగారి, మధు, సరీం, రవికుమార్, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, పీర్‌సాహెబ్, శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయ నిర్మాణానికి సహకరించడి

నిర్మాణ కమిటీ వినతి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో నిర్మిస్తున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణ పనులు 70శాతం పూర్తి అయి అసంపూర్తిగా ఉందని దానిని పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టేందుకు దాతలు సహకరించాలని ఆలయ చైర్మన్ తుమ్మలు రామమూర్తి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి దేవాలయ ప్రాంగణంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి కొంత భాగం మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరిగిందని అందుకు సహకరించిన వారందరికీ తెలిపారు. ఈ సమావేశంలో దేవాలయ కమిటీ బాధ్యులు వేములూరి కోటాచారి, అద్దంకి వీరభద్రాచారి, పోలోజు రామాచారి, అనంతోజు లక్ష్మణాచారి, గుండోజు కృష్ణయ్యాచారి, కల్లూరి నాగాచారి, తంగేళ్లపల్లి వెంకటేశ్వరచారి, పోలోజు నరసయ్యాచారి, మోడీపల్లి వాసు చారి, పోలోజు ఉపేంద్ర చారి,ప్రముఖ టీవీ మెకానిక్ ఉపేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని నర్సాపురం గ్రామంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం (చిన్నఅరుణాచలం) సోమవారం భక్తులతో పోటెత్తింది. కార్తీక పౌర్ణమి మొదటి సోమవారం కావడంతో పర్ణశాల ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం కార్తీక దీపాలను వెలిగించారు. జ్యోతిర్లింగ ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి భక్తులకు ప్రత్యేక ఆశీర్వచనాలతో పాటు తీర్ధ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా వారం రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు విగ్రహాల ప్రతిష్ట, లక్ష దీపోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

భద్రాచలంలో వేగంగా

మారుతున్న రాజకీయ సమీకరణలు

- సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల మధ్య నెలకొన్న పోటీ

- మూడో స్థానానికి పడిపోయిన బీఆర్ఎస్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ భద్రాచలంలో రాజకీయ సమీకరణలు వేగంగా మార్పు చెందుతున్నాయి. ఎన్నికల పొత్తులలో భాగంగా భద్రాచలం నియోజవర్గంలో సీపీఐ(ఎం) పోటీ చేస్తాదో లేదో అన్న సందేహంతో మొదట్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ నెలకొన్నది. మొదటినుండి పొత్తులు ఉన్నా లేకపోయినా భద్రాచలం గడ్డపై సీపీఐ పోటీ చేసి తీరుతుందని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చెప్పిన మాట అక్షర సత్యం చేస్తూ నవ యువకుడు కారం పుల్లయ్యను అభ్యర్థిగా నిలిపి వేలాది మందితో నామినేషన్ వేయించారు. అప్పటిదాకా ఉన్న రాజకీయ సమీకరణలు సీపీఐ(ఎం) వ్యూహాత్మకంగా నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచార నిర్వహిస్తూ గతంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధిని ప్రచారస్త్రాలుగా మలుచుకొని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భద్రాచలం నియోజకవర్గం వర్గానికి చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇటు కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకుంటూ ఆరు గ్యారంటీల ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రయత్నాన్ని చేస్తున్నారు. భద్రాచలం నియోజవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుండి చెప్పుకోవటానికి చేసింది ఏమీ లేక భద్రాచలం పై ఆ పార్టీ అధినేత చూపిస్తున్న వివక్షతతో ఆ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఎనుకబడింది. ఈ నేపథ్యంలో భద్రాచలంలో త్రిముక పోటీ తప్పదనుకున్న తరుణంలో అనూహ్యంగా సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పై అవినీతి ఆరోపణలతో పాటు ఐదేళ్లలో అభివృద్ధి చేయకపోవడం వంటి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ద్విముఖ పోటీలో సీపీఐ(ఎం)కే కలిసొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచన వేస్తున్నారు. భద్రాచలం నుండి వాజేడు వరకు కార్యకర్తల బలం ఉన్న సీపీఐ(ఎం) పార్టీ ఎన్నికలలో అతి తక్కువ సమయంలోనే ప్రజల్లోకి వెళ్తూ ఎన్నికల పోటీలో ముందు వరుసలో నిలుచుంది. ప్రధానంగా కరోనా సమయంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసోలేషన్ సెంటర్‌తో పాటు భద్రాచలం అభివృద్ధి కోసం ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల బరిలో నిలవగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ భద్రాచలంపై చూపిస్తున్న నిర్లక్ష్యం కారణంతో ఎన్నికలలో ఘోర పరాభవాని మూటకట్టుకుంటుందని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, సీపీఐ(ఎం) పార్టీల మధ్యనే తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ అంతిమంగా సీపీఐ(ఎం)దే పై చేయి సాధించవచ్చని స్పష్టమవుతుంది.

అదనపు బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ తనిఖీ



నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాకు చేరిన అదనపు బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ చెకప్ ప్రక్రియను జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపడుతుండగా, ఖమ్మం, వైరా నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు తుషార్ కాంత మహంతి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి.గౌతమ్‌తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతూ అభ్యర్థులు పోటీలో ఉండడంతో, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు మూడేసి చొప్పున, సత్తుపల్లి నియోజకవర్గానికి రెండు చొప్పున బ్యాలెట్ యూనిట్లు అవసరం కానున్నాయన్నారు. దీంతో అదనపు బ్యాలెట్ యూనిట్ల ఆవశ్యకత ఏర్పడగా, ఎన్నికల సంఘం 894 బ్యాలెట్ యూనిట్లు పంపినట్లు, వాటికి ఫస్ట్ లెవల్ చెకప్ చేపట్టినట్లు తెలిపారు. ఈసీఐఎల్ ఇంజనీర్లు చెకప్‌కి వచ్చినట్లు, వారు పోలింగ్ అయ్యేదాక ఇక్కడే ఉంటారన్నారు. చెకప్ తర్వాత, ర్యాండమైజేషన్ చేపట్టి, నియోజకవర్గాలకు కేటాయించనున్నట్లు వారు తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో నియోజకవర్గ స్థాయిలో చేపట్టే కమీషనింగ్‌కి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరవ్వాలన్నారు. ఈ నెల 22న రెండో ర్యాండమైజేషన్ అబ్జర్వర్‌ల సమక్షంలో చేపట్టనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సోమవారం నుండి ప్రారంభించినట్లు తెలిపారు. హెూమ్ ఓటింగ్ కోసం నమోదు చేసుకున్న 1564 మందికి సోమవారం నుండి ఓటింగ్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. హెూమ్ ఓటింగ్ ప్రక్రియకు 30 టీములు ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు తమ ఏజెంట్లను నియమించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కి పోలింగ్ కేంద్రానికి పాటించే నిబంధనలన్ని పాటించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణ చేపట్టి, శిక్షణ కేంద్రంలోని పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రదేశంలో రాజకీయ పార్టీలు తమ ఏజెంట్లను నియమించాలన్నారు. ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ జరుగుతున్నట్లు, ఇంటింటికి తిరిగి ప్రతి ఓటరుకు అందజేస్తారని, బల్క్‌గా ఒక్కరికే స్లిప్పులు ఇవ్వకూడదని వారు అన్నారు. సజావు ఎన్నికల నిర్వహణకు సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి నల్లమోతు తిరుమలరావు, బిజెపి పార్టీ ప్రతినిధి జివిఎస్‌ఆర్‌పి. విద్యాసాగర్, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ హుస్సేన్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి లింగబోయిన సతీష్, టిడిపి పార్టీ ప్రతినిధి కె. కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

భట్టి సతీమణి నందిని విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో యడవల్లిలో సోమవారం రాత్రి మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి భట్టి విక్రమార్కని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, నాయకులు బుల్లెట్ బాబు,మీడియా ఇన్చార్జి మల్లెల అజయ్ కుమార్,గ్రామ సర్పంచ్ చెరుకుపల్లి వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ కందిమల్ల వీరబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చెరుకుపల్లి రాంబాబు,మందరపు ఉపేందరరావు,తాళ్ల శ్రీను, ఉసికల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు : సీఐ

నవతెలంగాణ-పినపాక



ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించకుండా అభ్యర్థులు ప్రచారం నిర్వహించాలని ఈ బయ్యారం సీఐ శివప్రసాద్ కోరారు. మండల పరిధిలోని ఈ.బయ్యారం క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్పోస్ట్ వద్ద ఆయన మాట్లాడారు. మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వీలుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



గ్రెయిన్ మార్కెట్‌ను తరలించాలని కుట్రలు

- అడ్డుకొని పోరాడిన సీపీఐ(ఎం)కు ఓటేయండి
- సీపీఐ(ఎం) అభ్యర్థి యర్రా శ్రీకాంత్
- త్రీటౌన్‌లో విస్తృతంగా ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



ఖమ్మం గ్రెయిన్ మార్కెట్‌ని తరలించాలని కుట్రలు చేసిన చరిత్ర బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులదని, మార్కెట్ తరలింపును అడ్డుకొని పోరాడిన సీపీఐ(ఎం)కు ఓటేయాలని ఆ పార్టీ ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థి యర్రా శ్రీకాంత్ తెలిపారు. పార్టీ త్రీటౌన్ కమిటీ అధ్వర్యంలో గాంధీచౌక్‌లో షాప్ టూ షాప్ తిరుగుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఖమ్మంలో రెండు కార్పొరేట్ శక్తులు ఎన్నికలలో డబ్బుతో గెలవాలని చూస్తున్నారని అన్నారు. వారు ఎప్పుడైన కార్మికుల, ప్రజా సమస్యలపై పోరాడినారా అని ప్రజలు ఆలోచించి నిత్యం ప్రజల కోసం కార్మికుల, ప్రజల కోసం పనిచేస్తున్న తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, పార్టీ జిల్లా నాయకులు యర్రా శ్రీనివాసరావు, బండారు రమేష్, తుడుం ప్రవీణ్, త్రీ టౌన్ నాయకులు వాజినేపల్లి శ్రీనివాసరావు, బండారు యాకయ్య, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, బండారు వీరబాబు, పత్తిపాక నాగ సులోచన, మహమ్మద్ ఖాసిం, శీలం వీరబాబు, షేక్ మస్తాన్, బి.చౌదరి, అలివేలు, భూక్య సుభద్ర, రంగు హనుమంతచారి, సోమవపూ సుధీర్, సారంగి పాపారావు, చీకటిమల శ్రీను, గబ్బెటి పుల్లయ్య, వేల్పుల నాగేశ్వరరావు, కందుల శ్రీధర్, పాశం సత్యనారాయణ, నాయిని నరసింహారావు, హెచ్.పీరయ్య, మేకల మల్లికార్జున్, పాశం సైదమ్మ, షేక్ అమీనా, బండారు సునీత పాల్గొన్నారు.



వామపక్ష ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ దేవుడు లేని గుడి వంటిది

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు, కేరళ ఎల్డిఎఫ్ చైర్మెన్ విజయ రాఘవన్

నవతెలంగాణ-పినపాక

వామపక్ష ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ దేవుడు లేని గుడి వంటిదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు, కేరళ ఎల్డిఎఫ్ చైర్మెన్ విజయ రాఘవన్ అన్నారు. సోమవారం తెలంగాణ ఎన్నికల పర్యటనలో భాగంగా పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ వద్ద ఆయన మాట్లాడారు. పార్టీ పోటీ ఉన్న స్థానాల్లో ప్రజలు పార్టీని ఆదరించాలని కోరారు. సీపీఐ(ఎం) ఒంటరిగా పోటీ చేస్తుందని అనుకోవడం లేదని, లక్షలాది మంది ప్రజల గుండెల్లో ఎర్రగడ్డ స్థానం పదిలంగా ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పోడు భూములకై అనేక సమస్యలపై పోరాటం కొనసాగించిన చరిత్ర కేవలం పార్టీకే ఉందన్నారు. వామపక్ష పార్టీలు లేని తెలంగాణ అసెంబ్లీని ప్రజలు చూశారని అమ్ముడు పోని నిజమైన నాయకులు సీపీఐ(ఎం) నాయకులన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కామ్రేడ్లకు విలువ ఇవ్వలేదని వారితో కలిసి వెళ్లేది లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహిస్తుందన్నారు. ఆ పార్టీతో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని ప్రజలు గమనించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు తొత్తులుగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్రంలోని అధికార బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం కోసం సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. రాజ్యాంగ నిబంధనలు, ప్రజాస్వామ్య హక్కులను రక్షించడానికి నరేంద్ర మోడీ పాలనను ఓడించడమే ఏకైక మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బొడ వెంకట్, మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.

వనమాకు పట్టం కట్టండి

- పల్లెలు మెరవాలి.. ప్రగతి ఆగొద్దు
- అభివృద్ధికి ఓటెయ్యండి
- తెలంగాణ గొంతుక కేసీఆర్
- బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం
- ఎన్నికల ప్రచారంలో వనమా

నవతెలంగాణ-పాల్వంచ



అభివృద్ధి ప్రదాతను, పేద ప్రజల ఆపద్బాంధవుడను, పిలిస్తే పలికే నాయకుడను, బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న తనకు ఓటేసి పట్టం కట్టాలని కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పాల్వంచ మండల పరిధిలోని యానం బైలు, కిన్నెరసాని, పూసల తండా, కోడిపుంజుల వాగు, పుల్లాయి గూడెం, పునుకుల, బంజారా కాలనీ, కరకవాగు, సీతారాంపట్నం, ఎస్సీ కాలనీ, ప్రియదర్శిని కాలనీలలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారాన్ని నిర్వహించేందుకు వెళ్లిన వనమాకు ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. డప్పు, వాయిద్యాలు, నృత్యాల మధ్య తోడుకొని వెళ్ళగా వివిధ ప్రాంతాలలో జరిగిన సభల్లో వనమా మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి ఆగొద్దంటే బీఆర్ఎస్ గెలవాలన్నారు. ప్రగతిని గెలిపియాలని తద్వారా పల్లెలు మెరుస్తాయన్నారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని పిలుపునిచ్చారు. మోసపూరితపు మాయ మాటలతో డబ్బు సంచులతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న పార్టీలను నమ్మొద్దని సూచించారు. బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి అని తెలంగాణ గొంతుక అయిన కెసిఆర్ తిరిగి మూడోసారి ముఖ్యమంత్రి కావాలని అందుకు తనను ఈ నియోజకవర్గం నుంచి గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను ఉంచేందుకు ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు రూ.3000 పెన్షన్ను అందించ నున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా గ్యాస్ సైతం 400కే ఇవ్వడం జరుగుతుందన్నారు. 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నువ్వు ఎంపీగా ఉండి ఎన్ని నిధులు తెచ్చావ్...

- నేనెన్ని నిధులు తెచ్చానో చూపిస్తా...చర్చకు సిద్ధమా..?
- ఇకనైనా సొల్లు మాటలు మానుకో... లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు
- కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటిపై బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఫైర్

నవతెలంగాణ- నేలకొండపల్లి



"పాలేరు నియోజకవర్గంలో ఏం పని చేయలేదంటున్న పొంగులేటి... నీకు నచ్చిన గ్రామంలో నడిబొడ్డు బొడ్రాయి సెంటర్ వద్ద కూర్చుందాం చర్చిద్దాం రా" అంటూ కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం మండలంలోని అప్పలనరసింహపురం, కొంగర కట్టుకాచారం, బుద్దారం, రాయిగూడెం, చెరువుమాదారం గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. అనంతరం జరిగిన ఎన్నికల సభలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేశారు. "నువ్వు గతంలో ఎంపీగా ఉండి, ఎన్ని నిధుల తెచ్చావో చెప్పు... నేను ఎమ్మెల్యేగా ఉండి ఎన్ని నిధులు తెచ్చానో చూపిస్తా.. నీ సొల్లు మాటలు మాట్లాడకు..ఒళ్ళు దెగ్గర పెట్టుకొని మాట్లాడు బిడ్డ.. నా జనాన్ని కొనడం నీతరం కాదు. నీ తాతల తండ్రుల తరం కూడా కాదు. నువ్వు ఇలాగే సొల్లు మాటలు మాట్లాడితే జనమే నిన్ను చెప్పులతో కొడతారు... నా జనానికి ఏం కావాలో నాకు తెలుసు, నాకు ఏం కావాలో నా జనానికి తెలుసు.. నీకు తగిన చెబుతారు" అంటూ కందాళ హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు, తాను వ్యక్తిగతంగా ప్రజలకు అందించిన సేవా కార్యక్రమాలను వివరించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా గ్రామానికి విచ్చేసి తనకు ఘన స్వాగతం పలికిన ప్రజలందరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వివిధ పార్టీల నుండి పలు కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, కార్యదర్శి ఎన్నబోయిన శ్రీను, జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంతకుమారి, సిడిసి చైర్మన్ నెల్లూరి లీల ప్రసాద్, రైతుబంధు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్, గండు సతీష్, సొసైటీ చైర్మన్ తన్నీరు సత్యనారాయణ, అనగాని నరసింహారావు, నంబూరి సత్యనారాయణ, రాయపూడి నవీన్, శీలం వెంకటలక్ష్మి, వాసు, పతానపు నాగేశ్వరరావు, యాతాకుల భాస్కర్, గొలుసు రవి, బచ్చలకూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో పలు కుటుంబాలు చేరిక

కూసుమంచి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పాలేరు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు సోమవారం కందాళ ఉపేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కందాళ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాగి జావ తాగిన ఎమ్మెల్యే కందాళ...

కూసుమంచి గ్రామంలోనూ కూడలిలో ఆరోగ్యకరమైన రాగిజావ అమ్ముతూ కనపడిన చిరు వ్యాపారిని చూసి, తన వాహనాన్ని దిగి నవ్వుతూ పలకరించి, వారు తయారుచేసిన రాగి జావను పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తన నియోజకవర్గ ప్రజలకు ఇలాంటి ఆరోగ్యకరమైనవి తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీస్తూ, ఆ చిరు వ్యాపారిని ప్రోత్సహించారు.

ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బుచ్చాలు మృతి
కందాళ ఉపేందర్‌రెడ్డి నివాళి

నేలకొండపల్లి: మండలంలోని మంగ్రాజుపల్లి గ్రామానికి చెందిన నేలకొండపల్లి మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ప్రభంజన పదం రిపోర్టర్ తోళ్ళ బుచ్చాలు(49) సోమవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ పాలేరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఉపేందర్‌రెడ్డి, టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, నేలకొండపల్లి మండల ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు అత్తులూరి హనుమంతరావు, గౌరవ సలహాదారులు కొల్లి హరీష్‌బాబు, అధ్యక్షుడు దేగల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వర్లు, కోశాధికారి బైరం ప్రసాదరావు, ఐజేయు జిల్లా సహాయ కార్యదర్శి పోలంపల్లి నాగేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ సభ్యులు మేళ్లచెరువు వెంకటేశ్వర్లు, కసరబోయిన వెంకటేశ్వర్లు, ఎల్లుట్ల సైదులు, ఎన్‌డి కర్ణ, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.